ప్రభాత
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 07 మే 2026

## వెల్లమవారిపల్లెలో డ్రైనేజ్ సమస్యకు తక్షణ పరిష్కారం

**పులివెందుల, మే 6 , (ప్రభాత వార్త :**



పులివెందుల పట్టణ పరిధిలోని వెల్లమవారిపల్లెకు వెళ్లే మార్గంలో డ్రైనేజ్ బ్లాకేజ్ కారణంగా మురికి నీరు రోడ్డుపై చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఈ సమస్యపై స్థానిక ప్రజలు పలుమార్లు ఆందోళన వ్యక్తం చేయగా, విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు తుగుట్ల మధుసూదన్ రెడ్డి వెంటనే స్పందించారు.సమస్య ఉన్న ప్రాంతానికి తక్షణమే చేరుకున్న ఆయన మున్సిపల్ అధికారులతో మాట్లాడి డ్రైనేజ్ క్లీనింగ్ ట్యాంకర్ ద్వారా మురికి నీటిని తొలగించే చర్యలు చేపట్టించారు. అదేవిధంగా రహదారిపై ఉన్న గుంతలను జేసీబీ సహాయంతో సమతలీకరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మునికుమార్, మున్సిపల్ ఏఈ షేక్ అక్రమ్, యమహా షోరూమ్ కు చెందిన వాండ్ బాషా తదితరులు పాల్గొన్నారు. స్థానికులు సమస్యను వెంటనే పరిష్కరించేందుకు ముందుకొచ్చిన వారిని అభినందించారు.

## వైభవంగా పగడాలపల్లి గంగమ్మ తిరునాళ్ల

**పెండ్లిమర్రి, మే 6, ప్రభాతవార్త:**

మండలంలోని పగడాలపల్లె సమీపంలో వెలసిన గంగమ్మ ఆలయంలో బుధవారం వైభవంగా అమ్మవారి తిరునాళ్ల జరిగింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, మొక్కుబడులు తీర్చుకున్నారు. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనను సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఆలయ సమీపంలో భక్తులకు భారీగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



### అయ్యప్పనేని చెరువు సుందరీకరణ పనులు

# కాగితాలకే పరిమితం

**పీలేరు మే 6 ప్రభాతవార్త:**

పీలేరు అయ్యప్ప నేని చెరువు పట్టణానికి హుస్సేన్ సాగర్‌గా పిలవబడుతోంది. ఈ చెరువును చుట్టుపక్కల నుంచి ఆక్రమించుకోవడంతో కుంచించుకుపోతోంది. పీలేరు పట్టణ పరిధిలో ప్రాంతాల నుంచి మురుగునీరు అంతా ఈ చెరువులోకి చేరుతోంది. తద్వారా ఈ చెరువు నీళ్ళు ఇతర అవసరాలకు పనికి రాకుండా పోతుంది . ఈ క్రమంలో ఈ చెరువు సుందరీకరణకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సంబంధిత నీటిపారుదల, పంచాయతీ ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ చెరువును పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు గుర్తించాలని సంబంధిత శాఖ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఆరు నెలల క్రితం జరిగిన ఈ ప్రక్రియ కాగితాలకే పరిమితం అయింది. ఈ చెరువును పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి సరిహద్దులు గుర్తించాల్సి ఉన్నా కూడా సంబంధిత రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టలేదు. ఫలితంగా సుందరీకరణ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడని పరిస్థితి నెలకొంది. సుందరీకరణ పనులు జరిగితే చెరువు కట్టను అద్భుతంగా సుందరీకరించి వీధి దీపాలు, బల్లలు, రన్నింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్ తదితర సౌకర్యాలు సమకూరే అవకాశం ఉంటుంది. అయినా కూడా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ ప్రక్రియ పూర్తి అయితే ఈ చెరువు నుంచి ట్రీట్మెంట్ పథకం ద్వారా నీటిని శుద్ధి చేసి చెరువులోకి వదిలే అవకాశం వచ్చింది. మన జిల్లాకు పీలేరు అయ్యప్పనేని చెరువు ట్రీట్మెంట్ పథకానికి ఎంపిక చేశారు. ఇదే జరిగితే రూ. 50 లక్షల వ్యయంతో ఈ పనులు ప్రారంభించే అవకాశం ఉంటుంది. ట్రీట్మెంట్ పనులు పూర్తయితే మురికి కూపంలో ఉన్న అయ్యప్ప నేని చెరువు నీరు శుద్ధపరిచి అన్ని అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. తద్వారా పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతుంది. ఇంత అవకాశం ఉన్నా కూడా సంబంధిత శాఖల అధికారులు ఏమాత్రం ఆసక్తి కనబడచకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. చెరువును పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు గుర్తిస్తామని రెవిన్యూ అధికారులు చెబుతుండగా.. ఇదే చెరువును పూర్తిస్థాయిలో సుందరీకరణ చేసి అభివృద్ధి పరచాల్సిన పంచాయతీ అధికారులు ఎత్తకపోవడంతో ట్రీట్మెంట్ ప్రాజెక్టు ప్రారంభించలేమని



గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. అయ్యప్ప నేని చెరువు సుందరీకరణ పనులు ఆగిపోవడానికి రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంతో పాటు గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు అలసత్వం కొట్టుకొచ్చినట్టు కనబడుతోంది.

## 6 లక్షల విలువైన CMRF చెక్కుల పంపిణీ

### బాధిత కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే మాధవి

**కడప మే 6 ప్రభాతవార్త :**



కడప నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ మరియు కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యల కారణంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 15 మంది లబ్ధిదారులకు, మొత్తం రూ. 6 లక్షల విలువైన చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ఈ ఆర్థిక సాయం ఎంతో తోడ్పడుతుందని, భవిష్యత్తులోనూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బాగుపడ్డ బాహుదా కాలువ

### జలధార పనులతో సుందరీకరణ

**మదనపల్లె, మే 6 ప్రభాతవార్త :**

పట్టణ నడిబొడ్డున ఉన్న బాహుదా కాలువ ఎట్టకేలకు జలధార పనుల్లో భాగంగా సుందరీకరణ అయ్యింది. ముళ్లమొక్కలు, చెత్తా చెదారాలతో దుర్వాసనలు వెదజల్లె బాహుదా, బుగ్గకాలువలు సుందరీకరణ అవుతున్నాయి. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశాలతో మున్సిపల్ కమీషనర్ ప్రమీల ఆధ్వర్యంలో పట్టణంలోని రెండు ప్రధాన కాలువలు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో పాటు కోమిటివానిచెరువులో కూడా సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం ఈ పనులను మున్సిపల్ ప్రత్యేక అధికారి, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పనులు తనిఖీ చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జలధార పనులను అధికారులు ముమ్మరంగా చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో మైనర్ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చెరువు సప్లై చానల్ పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. ఉపాధి హామీ పథకం కింద కూడా కాలువ పనులను చేపట్టడం జరుగుతోంది.



పనులను పరిశీలిస్తున్న జేసి (పాతచిత్రం)

## వైకాపా హయాంలో రాజంపేటలో అభివృద్ధి శూన్యం

**రాజంపేట, మే6 ప్రభాతవార్త**

ముస్సిపాలిటీలో వైకాపా హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు విమర్శించారు. జగన్ హయాంలో రాజంపేట మున్సిపాలిటీని పట్టించుకున్న పాపాన పోలేదని ధ్వజమెత్తారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదవ వార్డు బాలాజీ నగర్ లో ఆయఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ఎన్నికల హామీలు,కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో పాటు రాష్ట్రంలో పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి కల్పిస్తుందన్నారు.ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అదేవిధంగా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం ఇస్తున్నామని, భర్తను కోల్పోయిన వారికి మరుసటి నెల నుంచి వితంతు పింఛన్లు మంజూరు చేస్తున్నామని తెలియజేశారు. అంతేకాకుండా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుంటే ఓర్వలేకే జగన్ అండ్ కో తప్పుడు ప్రచారం చేస్తుందని చమర్తి మండిపడ్డారు. అంతకుముందు వార్డు పర్యటనలో ప్రజలు పలు రకాల సమస్యలను చమర్తి దృష్టికి తీసుకురాగా తక్షణమే పరిష్కరించాలని అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సి సుధాకర్,పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ డైరెక్టర్ గుల్జార్ భాష,పట్టణ ప్రధాన కార్యదర్శి అడపాల శ్రీనివాసులు,మాజీ అధ్యక్షులు సంజీవరావు,మాజీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడగల కుమార్, మాజీ కౌన్సిలర్లు మనుబోలు వెంకటేశ్వర్లు,కౌన్సిలర్ మనుబోలు వెంకటసుబ్బయ్య, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కె కరీమ్, డాక్టర్ నవీన్ కుమార్, బూత్ కన్వీనర్లు అంజిబాబు ఆచారి, ఎద్దులపల్లి బాలాజీ నాయుడు, పీర్ భాష, యూనిట్ ఇంచార్జ్ మహమ్మద్ అలీ, నాగ ముని ఆచారి,శంకరాచారి,సొసైటీ డైరెక్టర్ పరుశురాం నాయుడు, సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న జగన్ మోహన్ రాజు

## ఆటో ప్రమాదం

### ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

**గోపవరం, మే 6, ప్రభాతవార్త**

గోపవరం మండలం సెంచరీ ప్లైవుడ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే, కడప పట్టణానికి చెందిన లక్ష్మిదేవి(34), పెంచలమ్మతో పాటు మరో ఇద్దరు మహిళలు పెంచలకోనలోని నరసింహా స్వామిని దర్శించుకునేందుకు ఆటోను అద్దెకు తీసుకుని వెళ్లారు. దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణంలో సెంచరీ ప్లైవుడ్ సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద వాహన నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన డివైడర్‌ను ఆటో డ్రైవర్ గమనించవేగంగా వచ్చిన ఆటో అదుపు తప్పడంతో ప్రయాణికులు రోడ్డుపై ఎగిరి పడిపోయారు. ఈ ఘటనలో లక్ష్మిదేవి తీవ్రంగా గాయపడగా, రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఆమె కాలుపై వెళ్లడంతో తీవ్ర గాయాలు మరింత పెరిగాయి.సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై రంగారావు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని అంబులెన్స్ ద్వారా బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు, అక్కడి నుంచి తిరుపతిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో లక్ష్మిదేవి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.మృతదేహానికి పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### ఎస్ఎస్ మాల్ వ్యవహారంలో ప్రమాణానికి సిద్ధమన్న

## రాచమల్లు పిలుపును స్వాగతిస్తున్నా

### రాచమల్లుపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నా
### టిడిపి మాజీ ఇంచార్జ్ జి వీర ప్రవీణ్ కుమార్ రెడ్డి

**ప్రొద్దుటూరు మే 06, ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని ఎస్ ఎస్ మాల్ షాపింగ్ కాంప్లెక్స్ వ్యవహారంలో రాచమల్లు పై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని, ప్రమాణానికి సిద్ధమా అన్న రాచమల్లు సవాల్‌ను స్వీకరిస్తున్నానని టిడిపి మాజీ ఇంచార్జ్ డాక్టర్ జి. వీర ప్రవీణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన ప్రమాణం చేసే స్థలం, సమయం, తేదీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపితే, వారు నాపై చేసిన ఆరోపణలపై తాను ప్రమాణం చేస్తానని, వారు తెలిపిన విదంగా తాను కోరే అంశాలపై వారు ప్రమాణం చేయాలని, రాచమల్లు మరియు ఆయన సోదరుడు కిరణ్ కుమార్ రెడ్డి, ఆయన బావమరిది, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ముగ్గురు కలిసి వస్తే వారితో ప్రమాణం చేయడానికి సిద్ధమని తెలిపారు. వారు తనపై చేసిన ఆరోపణలకు తాను కూడా అక్కడే ప్రమాణం చేస్తానని, తనతో పాటు తన కుటుంబ సభ్యులు కూడా వస్తారని వివరించారు. తాను ఎస్ఎస్ మాల్ విషయంలో చేసిన ఆరోపణలను ఖండించిన మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ప్రొద్దుటూరులో అక్రమ నిర్మాణాలు ఆపాలని, అనుమతులు లేని నిర్మాణాలను ఆపి ప్రజలను ఇబ్బంది పడకుండా చేయాలని ప్రతిపక్ష ఎమ్మెల్యే గా 2017లో సంబంధిత అధికారులకు లేఖ ద్వారా రాచమల్లు తెలిపారని, 2019 నుండి 2024 వరకు అధికార పార్టీ ఎమ్మెల్యే గా వుండి కూడా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తాను ఆదివారం ఎస్ఎస్ మాల్ విషయం ప్రస్తావించిన తర్వాత దాదాపు 20 లక్షల రూపాయలు ఎస్ ఎస్ మాల్ యాజమాన్యం చెల్లించినట్లు మున్సిపల్ ఆర్ఐ తెలిపారని స్పష్టం చేశారు. రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అధికార పార్టీ ఎమ్మెల్యే కాక ముందు మైదుకూరు రోడ్డు చక్కగా కాకుండా వంకర టింకర గా వుండేదా అని ప్రశ్నించారు. కూరగాయల మార్కెట్ కు తాము వెళితే అక్కడ రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేసిన అక్రమ వసూళ్లు కనిపిస్తున్నాయని వివరించారు. భయం తనకో, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు కో గతాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. కాగా 2019 నుండి 2023 వరకు టిడిపికి దూరంగా వున్న వారు నేడు తనను విమర్శించడం సరి కాదన్నారు. వైసిపి తో చీకటి ఒప్పందాలు చేసుకున్నది మీరు కాదా అని నిలదీశారు. తాను ఎవరి వద్దా అప్పులు చేసి వారిని ఇబ్బంది పెట్టడం లేదన్నారు. తాను టిడిపి జెండాను అమ్ముకోలేదని, పార్టీ కౌన్సిలర్ టికెట్ ఇస్తే అమ్ముకున్న వారు ప్రస్తుత ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వర్గీయులలో పలువురని విమర్శించారు. మనలో ఎవరు పార్టీ కష్ట కాలంలో నిలబడ్డారో నిజమైన టిడిపి కార్యకర్తల ద్వారా ఓటింగ్ కు సిద్ధమా అన్నారు. ప్రొద్దుటూరు లో గత 40 సంవత్సరాలుగా ఇరువరు నాయకుల వలనే అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ప్రొద్దుటూరు అభివృద్ధి కోసం తాను నిరంతరం పోరాడతానని స్పష్టం చేశారు.

### జిల్లాలో ఇసుక సరఫరా సక్రమ నిర్వహణకు

# కట్టుదిట్టమైన చర్యలు

**కడప, మే 6 ప్రభాతవార్త :**

జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా మరియు సరఫరా వ్యవస్థను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డిఎల్ఎస్సి) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తోపాటు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డా. నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ భావన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి.. మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పట్టా భూముల్లో ఇసుక డీకాస్టింగ్‌కు అనుమతుల విషయాన్ని సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. రాజంపేట మండల పరిధిలోని కొన్ని భూముల్లో ఇసుక తవ్వకాల అనుమతిపై చర్చించి, నిర్ణయాన్ని కమిటీ తీసుకోనుందని పేర్కొన్నారు.అలాగే పక్క జిల్లా అయిన అన్నమయ్య జిల్లాలో బాహుదా నదిలో నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌కు సంబంధించిన ఏజెన్సీ అధిక ఖర్చులు, తక్కువ ఇసుక లభ్యత కారణంగా పనులు నిలిపివేయాలన్న అభ్యర్థనపై కూడా సమావేశంలో చర్చించారు. దీనిపై తుది నిర్ణయాన్ని కమిటీ తీసుకుంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. వర్షా కాలంలో ఇసుక తవ్వకాలు నిలిచిపోయే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు నిరంతర ఇసుక సరఫరా కల్పించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాకు 4 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లక్ష్యాన్ని నిర్ణయించిన నేపథ్యంలో, 6 సెమీమెకనైజ్డ్ రీచ్‌లు, 2 మాన్యువల్ రీచ్‌లను ప్రారంభించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు జిల్లా, డివిజనల్ స్థాయిలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. రెగ్యులర్ తనిఖీలు నిర్వహిస్తూ స్టాక్ యార్డులు, ఇసుక రీచ్‌లపై నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇటీవల ఇసుక అక్రమ రవాణాపై వచ్చిన ఫిర్యాదులు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కేసులను దృష్టిలో ఉంచుకుని కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కచ్చితంగా అమలు చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే ఇసుక సరఫరా వ్యవస్థ సక్రమంగా నడుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గనులు భూగర్భ శాఖ డిడి సుబ్రమణ్యం, రీజినల్ ట్రాన్స్పోర్ట్, పోలీస్ అధికారులు, భూగర్భ గనుల శాఖ, పిసీబీ శాఖ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.




### మహిళల భద్రత

## మనందరి బాధ్యత

**దువ్వూరు, మే 6, ప్రభాతవార్త:**

సమాజంలోని మహిళలకు సంబంధించిన భద్రత మన అందరి బాధ్యత అని మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం దువ్వూరులోని ఓ కళ్యాణ మండపంలో మహిళల భద్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాల నివారణకు, మహిళా భద్రత చర్యలు చేపట్టేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళలపై నేరాల నివారణకు కమ్యూనిటీ పోలీస్ లో భాగంగా ఖీమీ రక్షణమా బాధ్యతఖి అనే అంశంపై వివరించారు. మహిళల హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఆపద సమయంలో భయం వీడి పోలీసులను సంప్రదించాలన్నారు. మహిళలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ శాఖలు అన్ని సమన్వయంతో పని చేస్తున్నాయని అన్నారు. సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ ధనుంజయుడు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.




## వ్యవసాయ యంత్రీకరణకు ప్రాధాన్యం

**కడప, మే 6 ప్రభాతవార్త:**

జిల్లాలో వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరించి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా SMAM (Sub Mission on Agricultural Mechanization) పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా.. జిల్లాలో రైతులకు వ్యవసాయ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పనితీరును మెరుగుపరచడం, కార్మిక వ్యయాన్ని తగ్గించడం, దిగుబడులను పెంచడం ప్రధాన లక్ష్యంగా ఈ పథకం అమలవుతోందని తెలిపారు. SMAM పథకం కింద రైతులకు వివిధ రకాల వ్యవసాయ యంత్రాల కొనుగోలుపై సబ్సిడీలు అందజేస్తున్నామన్నారు. ముఖ్యంగా ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, రోటావేటర్లు, సీడ్ డ్రిల్లులు, హార్వెస్టర్లు, స్ప్రేయర్లు వంటి పరికరాలకు సబ్సిడీ అందుతుందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, వారికి 40 నుండి 50 శాతం వరకు సబ్సిడీ కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ పథకం కింద 40 HP లోపు ట్రాక్టర్లు, చిన్న యంత్రాలకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని, రైతులు తమ అవసరాలకు అనుగుణంగా యంత్రాలను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. వ్యవసాయ పనులు వేగంగా, సమయానికి పూర్తవ్వడం ద్వారా దిగుబడులు మెరుగుపడతాయన్నారు. ఈ పథకానికి అర్హులైన రైతులు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన "e-Seed" పోర్టల్ (https://eseed.ap.gov.in!!) ద్వారా నమోదు చేసుకుని అవసరమైన పత్రాలు అప్ లోడ్ చేసి అప్లికేషన్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఆధార్, భూమి పత్రాలు, బ్యాంక్ ఖాతా వివరాలు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. ముందుగా రైతులు తమ వివరాలతో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, తర్వాత కావలసిన యంత్రాన్ని ఎంపిక చేసుకుని దరఖాస్తు చేయాలని తెలిపారు. ఈ పథకం కింద ఆన్ లైన్ దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసిన 15 రోజుల్లో సమర్పించాల్సి ఉంటుందన్నారు.

## వేంపల్లిలో తీరనున్న నీటి కష్టాలు

**వేంపల్లి:మే 06(ప్రభాత వార్త )**



గ్రామపంచాయతీ పరిధిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని టీడీపీ మండల కన్వీనర్ రామముని రెడ్డి స్పష్టం చేశారు. పట్టణానికి నీటిని సరఫరా చేసే నాలుగు ప్రధాన విద్యుత్ మోటార్లు ఇటీవల సాంకేతిక కారణాలతో కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ సమస్యపై నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ బిటెక్ రవి తక్షణమే స్పందించి, యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేయించాలని స్థానిక నాయకులను ఆదేశించారు. నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదేశాల మేరకు, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, పార్టీ నాయకుడు మొండోడు గౌస్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు.పాపాగ్ని నదిలో రెండు మోటార్లు,సాయిబాబా గుడి వద్ద ఒకటి, చింతలమడుగు పల్లి వద్ద మరొకటి.. మొత్తం నాలుగు మోటార్లను సొంత ఖర్చులతో బాగు చేయించి, పునరుద్ధరించారు. బుధవారం సాయంత్రం ఈ మోటార్ల ద్వారా నీటి సరఫరాను పునఃప్రారంభించారు.ఈ సందర్భంగా రామమునిరెడ్డి మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడకూడదన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎక్కడైనా పైపులైన్ల సమస్య ఉన్నా లేదా నీటి ఎద్దడి తలెత్తినా, వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ప్రజలు త్రాగునీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈరోజు కూడా శ్రీరామ్నగర్ గుట్టకు రెండు నీటి ట్యాంకర్లతో నీరు తోలడం జరుగుతున్నదిఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొండోడు గౌస్, పసుపులేటి వీరభద్ర, మహమ్మద్, జబీబుల్లా, డక్కా రమేష్ గోగుల మారుతి దేరంగుల బాబు మేస్త్రీ రమణ కార్యకర్తలు పాల్గొన్నారు.



## సెమిస్టర్ ఫలితాల్లో ఇద్దరు వేదవ్యాస విద్యార్థులకు 10కి 10 గ్రేడ్



ప్రొద్దుటూరు అర్బన్, మే 6 ప్రభాత వార్త :
యోగి వేమన యూనివర్సిటి నిర్వహించిన డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో శ్రీ వేదవ్యాస డిగ్రీ కాలేజి విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. యూనివర్సిటి స్థాయిలో ఇద్దరు విద్యార్థులు 10 కి 10 గ్రేడ్ సాధించడం విశేషం అని కళాశాల కరస్పాండెంట్ ఎల్. నాగేశ్వర రెడ్డి తెలిపారు.మొదటి సెమిస్టర్ బియస్సీ విభాగంలో యు.అర్షియా సన 10, ఎమ్.మహాలక్ష్మి 9.63, టి.శ్రీలేఖ 9.25.బి. కామ్ విభాగంలోషేక్ సుమయ 10 ,ఎస్.వసీమా సుల్తానా 9.63 , వై.అర్షియా 9.63,ఎన్.భార్గవి 9.63,టి.నవిత 9.63,ఎం.నేహ 9.50.మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జి. సుదర్శన రెడ్డి, యన్.యస్.యస్ కోఆర్డినేటర్స్ నాగరాజ, రామలక్ష్మిరెడ్డి, యాసిన్ అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## జగనన్న కాలనీ సందర్శించిన ఎమ్మెల్యే



ప్రొద్దుటూరు అర్బన్, మే 6 ప్రభాతవార్త
స్థానిక మీనాపురంలోని జగనన్న కాలనీలో బుధవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి పర్యటించి అక్కడి వసతులు,సౌకర్యాలు గురించి తన నిర్వాసితులను ఆరా తీశారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రజలు తమ సమస్యల గురించి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డికి విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, లింగాపురం సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు సిద్ధారెడ్డి నాగముని రెడ్డి, ప్రొద్దుటూరు 30 వ వార్డు టిడిపి నాయకుడు మార్తల గురివి రెడ్డి,స్థానిక కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## 7 ఇసుక ట్రిప్పర్లు సీజ్

నందలూరు, మే 6 ప్రభాతవార్త :



అనుమతులకు విరుద్ధంగా సాయంత్రం 6 గంటలకు పైగా డంపింగ్ యార్డ్ వద్ద ఉండవలసిన ఇసుక ట్రిప్పర్లు ఇసుక రీచ్‌లో ఉండడంతో వాటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తాసిల్దార్ శివలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని కుమరునిపల్లె చెయ్యేరు లోని ఇసుక రీచ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ట్రిప్పర్లు ఉన్నాయన్న విషయం సమాచారం అందుకొని ఆర్ఐ సుశీల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులతో కలిపి దాడులు చేయడం జరిగిందని అన్నారు. అనంతరం 7 టిప్పర్లను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు.

## గోకులం షెడ్డు ప్రారంభించిన మోహన్‌రెడ్డి

సిద్ధవటం ఏప్రిల్ 6 ప్రభాతవార్త



రైతుల పశువుల పాగాకు గ్రామ గ్రామాన గోకుల నిర్మాణ పనులు చేపట్టామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి తెలిపారు మండలంలోని జ్యోతి గ్రామంలో బుధవారం రైతు ముక్కర ఈశ్వర్‌రెడ్డి పశువుల పాగాకు ఉపాధి హామీ నిధులతో నిర్మాణం చేపట్టిన గోకులం షెడ్డును టిడిపి రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంతోషమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల పక్షాన ఉపాధి నిధులతో గోకులాలు నిర్మించడం రైతులకు ఊరటగా ఉంటుందని బర్రెలు, మేకల పాగాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## ముంపు బాధితులకు నష్టపరిహారం అందజేయండి

నందలూరు మే 6 ప్రభాతవార్త:



సోమశిల వెనుక జలాల వల్ల ముంపుకు గురైన పొత్తపి గ్రామ ప్రజల భూములకు నష్టపరిహారం అందజేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ సోమశిల బ్యాక్ వాటర్ వల్ల భూములు కోల్పోయిన పలువురికి నేటికి బాధితులకు పరిహారం పూర్తి స్థాయిలో అందక వ్యవసాయం చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్యను చరవాణి ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. బాధితులకు త్వరగా న్యాయం చేయాలని తెలిపారు. అనంతరం పొత్తపి బిజెపి యువనేత వెంకట్ రెడ్డి తండ్రి మనోహర్ రెడ్డి కి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ యాదవ్, రాష్ట్ర సీనియర్ నాయకులు హిమగిరి యాదవ్, మండల అధ్యక్షుడు చుక్క శ్రీనివాసులు, సింగల్ విండో త్రీ కమిటీ మెంబర్ ఆంధ్ర శివారెడ్డి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీలోకి 20 కుటుంబాల చేరిక

బద్వేలు, మే 6, ప్రభాతవార్త
నియోజకవర్గంలోనీ కాశినాయన మండలం ఇటుకలపాడు పంచాయతీ కొట్టాలపల్లి గ్రామంలో వైఎస్ఆర్సీపీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రితేష్ రెడ్డి సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో జరుగుతున్న పాలనపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని, ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రాధాన్యమని, పార్టీలో చేరిన వారిని కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. మండల సొసైటీ అధ్యక్షుడు బంగారు గురువు రెడ్డి, స్థానిక నాయకుడు కె. మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎం. నారాయణరెడ్డి, ఎం. మల్లికార్జునెడ్డి, వి. కేశవరెడ్డి, కే. వెంకటరామిరెడ్డి, ఎం. నర్సింహులు, జి. పోలయ్యా, ఎం. వెంకటసుబ్బయ్యా, ఎం. రవీంద్రారెడ్డి, వి. పెద్ద ఖాదర్ రెడ్డి, జి. నాగరాజు, కే. కృష్ణారెడ్డి, వీరయ్య, పోలయ్య, దేవినేని కృష్ణారెడ్డి మరియు ఇతర కుటుంబ సభ్యులు. తదితరులు ఉన్నారు.



# లోక కళ్యాణం కోసం వృక్ష రాజాల వివాహం

### బద్వేల్‌లో వైభవంగా వేపమర్రి చెట్ల కళ్యాణ మహోత్సవం



బద్వేల్ అర్బన్, మే 6 ప్రభాతవార్త:
ప్రపంచ శాంతి వర్ధిల్లాలని, యుద్ధాలు ముగిసిపోవాలని మరియు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలనే సంకల్పంతో బద్వేల్ సమీపంలోని నందిపల్లి మాధవి ఫామ్ హౌస్ ఒక ఆధ్యాత్మిక వేదికగా మారింది. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మావతి (పద్మావతి హాస్పిటల్) మరియు వారి భర్త పెద్దిరెడ్డి సతీష్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం నాడు వేప చెట్టు, మర్రి చెట్టుకు లోక కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు విష్ణు స్వామి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ఈ కళ్యాణ ఘట్టం శాస్త్రోక్తంగా సాగింది. హిందూ సంప్రదాయంలో వేప (శక్తి స్వరూపం), మర్రి (శివ స్వరూపం) చెట్ల కళ్యాణం ప్రకృతి ఆరాధనలో భాగమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు, లోక హితానికి చిహ్నమని పండితులు ఈ సందర్భంగా వివరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ, పూజా కార్యక్రమాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. రాజకీయ, సామాజిక ప్రముఖులు ఈ అపురూప ఘట్టాన్ని వీక్షించేందుకు బద్వేల్ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. పలువురు రాజకీయ నాయకులు, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని, ప్రకృతి స్వరూపమైన వృక్షాలను దర్శించుకున్నారు. ఫామ్ హౌస్ అంతా ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. భక్తుల గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది. కళ్యాణోత్సవానికి విచ్చేసిన భక్తులకు, నాయకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సతీష్ రెడ్డి కుటుంబ సభ్యులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం అనంతరం విచ్చేసిన వారందరికీ ప్రత్యేక అన్న ప్రసాద వితరణ చేపట్టారు. సతీష్ రెడ్డి దంపతులు స్వయంగా అతిథులను గౌరవించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు."ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో యుద్ధాలు ఆగిపోయి, ప్రపంచమంతా శాంతి నెలకొనాలని, ముఖ్యంగా మన రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ లోక కళ్యాణాన్ని సంకల్పించామని ."డాక్టర్ పద్మావతి సతీష్ రెడ్డి దంపతులు ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో స్థానిక ప్రజలు, ఆధ్యాత్మిక వేత్తలు డాక్టర్ పద్మావతి దంపతుల సేవా తత్పరతను, భక్తి భావాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామకోటి రాజు, కటారు రామయ్య, శ్రీకృష్ణ కోలాటం మాస్టర్ వెంకటేశ్వర్లు, సుభాష్, చెన్నారెడ్డి, పిచ్చయ్య యాదవ్, బిజెపి పట్టణ అధ్యక్షులు,, దర్మిశెట్టి వెంకటసుబ్బయ్య, సంజీవరెడ్డి పెద్ది సుధాకర్ మరియు పలువురు భక్తులు పద్మావతి హాస్పిటల్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## నేడే రాజంపేటలో బలిజపల్లి గంగ జాతర



రాజంపేట, మే 6 ప్రభాతవార్త
కోరిన కోరికలు తీర్చే గ్రామదేవత బలిజపల్లె గంగ జాతర నేడు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. రాజంపేట పట్నం బల్లి పల్లెలోని గంగమ్మ జాతరకు ఆదివారం జరిగింది. బుధవారం రాత్రి నుంచి జ్యోతులతో మహిళలు తమ మొక్కలు తలపై పెట్టుకుని ఊరేగింపుగా జాతర జరిగే ప్రాంగణంలో ప్రదక్షిణలు చేశారు. మరోవైపు జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే అప్రమత్తంగా ఉండాలని పోలీసులను ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి బందోబస్తు కోసం వచ్చిన సిబ్బందితో ఆయన మాట్లాడారు. రాజంపేట అర్బన్ సీఐ నాగార్జున సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. జాతర జరిగే చుట్టుపక్కల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వాటిని పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. 24 గంటల పాటు జాతర బందోబస్తులో జాగ్రత్తలు తీసుకుంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు.

## ఒకరికి గాయాలు మరొకరు మృతి

మైదుకూరు, మే 06, ప్రభాతవార్త:



కడప జిల్లా మైదుకూరు మండలం లోని బద్వేల్ రోడ్డు జాతీయ రహదారి నందు పెద్ద శెట్టిపల్లె దగ్గర సోమయాజుల పల్లె నుండి జీవీ సత్రం కు వెళ్తున్న ఆటోను టిప్పర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరికి స్వల్ప గాయాలు కాగా మరొకరికి తలకు బలమైన గాయం కావడంతో 108 సిబ్బంది చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయమైన వ్యక్తిని మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ౖసటయ్య (56) మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సమాచారం మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

## ఎఫ్‌టికే ద్వారా స్వయంగా నీటి నాణ్యత పరీక్షలు



రాయచోటి మే 6 ప్రభాత్‌వార్త
ఎఫ్ టి కే పద్ధతి ద్వారా వసతి గృహ సంక్షేమ అధికారులు స్వయం గా నీటి పరీక్షలను నిర్వ హించి నాణ్యతను అన్నమయ్య జిల్లా ఆర్డబ్ల్యూఎస్ శాఖ డిఆర్ఈఓ సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక స్థాయి ఇంజనీరింగ్ కళాశాల సభా భవనం లో జిల్లాలోని బీసీ ,ఎస్టీ వసతి గృహాల సంక్షేమ అధికారులు, ఏఎస్ డబ్ల్యూఓలకు ఆర్ డ బ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో నీటి పరీక్ష ల నిర్వహణపై ఒక్కరో జు శిక్షణా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సతీష్ మాట్లాడుతూ గతంలో వసతి గృహాల్లో విని యోగించే బోరు బావు లలో నీటిని దూర ప్రాం తాల్లోని ల్యాబ్ లలో పరీక్షలకు పంపేవారం అన్నారు. ప్రభుత్వం ఈ ఇబ్బందిని గమ నించి సంక్షేమ వసతి గృహాల లోని నీటిపరీ క్షల నిర్వహణకు ఎఫ్ టికె కిట్లను సరఫరా చేసిందన్నారు. వసతి గృహ సంక్షేమ అధికా రులు నీటి నాణ్యతను ఎఫ్ టి కె పద్ధతి ద్వారా పరీక్షించు కోవచ్చున న్నారు. నీటి నాణ్యత పరీక్ష పై ఇస్తున్న శిక్షణ ను అధికారులు సద్వి నియోగం చేసుకోవా లని కోరారు. కార్యక్రమంలో డిడి సోషల్ వెల్ఫేర్ శ్రీరాము లు, జిల్లా ఎస్టి వసతి గృహాల అధికారిని తేజస్విని, పలువురు ఏ ఎస్ డబ్ల్యూ ఓ లు, వసతి గృహ సంక్షేమ అధికారులు,ఆర్డబ్ల్యూ ఎస్ అధికారులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న తులసిరెడ్డి

వేంపల్లి:మే06(ప్రభాత వార్త )



మండలం,లో నీ ముత్తుకూరు గ్రామ పొలిమేరలో బుధవారం శ్రీశ్రీశ్రీ పాలేటమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట అంగరంగ వైభవంగా, శాస్త్రోక్తంగా జరిగింది. రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, సుబ్బారెడ్డి, ఐచర్ రమణ, నర్రెడ్డి శంకర్ రెడ్డి తదితరులు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఉత్తమారెడ్డి, మస్తాన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి,ఆంజనేయ రెడ్డి, సాంబశివుడు తులసి రెడ్డికి కాంగ్రెస్ నాయకులకు ఘన స్వాగతం పలికారు.తులసి రెడ్డిని శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ అశాంతితో అలమటిస్తున్న ఆధునిక మానవునికి ఆధ్యాత్మిక క్షేత్రాలు ప్రశాంతిని కలిగిస్తాయన్నారు.అటువంటి ఆధ్యాత్మిక కేంద్రమే శ్రీ శ్రీ శ్రీ పాలేటమ్మ తల్లి ఆలయం అన్నారు.విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినందుకు ఆలయ నిర్వాహకులను తులసి రెడ్డి అభినందించారు.గ్రామదేవత పాలేటమ్మ తల్లి కరుణాకటాక్ష వీక్షణాలు గ్రామ ప్రజలపై ప్రసరించాలని కోరుకున్నారు పాలేటమ్మ తల్లి ఆశీర్వాదాలతో ముత్తుకూరు, పరిసర పల్లెల ప్రజానీకం సుఖశాంతులతో,శాంతి సౌభాగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

## మే 11న వేంపల్లి ఐటిఐలో జాబ్ మేళా

వేంపల్లి:మే 06(ప్రభాత వార్త )
వేంపల్లి ఐటీ ఐ లో ఈ నెల 11వ తేదీన అనగా సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీ ఐ ప్రిన్సిపాల్ ప్రసాదరావు తెలిపారు. బెంగుళూరు కు చెందిన ఇనోదయా ప్రిసెప్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపనీ వారు పలు మల్టీ నేషనల్ కంపెనీస్ కు హెల్పర్స్ ఆపరేటర్స్ ఇంజనీర్ ల కోసం అభ్యర్థులు ఎంపిక కోసం వేంపల్లి ఐటిఐ కి వస్తున్నారని 10వ తరగతి నుండి బీటెక్ వరకు నిరుద్యోగులు అయిన అభ్యర్థులు కు అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. జీతం 18000 నుండి 27000వరకు ఉంటుందని వీటితో పాటు ఈ ఎస్ ఐ. పి ఎఫ్. కాంటీన్ ట్రాన్స్ పోర్ట్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా జిరాక్స్ కాపీ లు తీసుకొని రావాలని కోరారు. సోమవారం ఉదయం 10నుండి ఒంటి గంట వరకు ఇంటర్వ్యూస్ వుంటాయని ఐటి ఐ ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడ హాజరు కావచ్చని తెలిపారు

## శుభ్ర గ్రామాల దిశగా పవన్ కళ్యాణ్ చర్యలు

వేంపల్లె:మే 06 ప్రభాతవార్త



గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపడుతున్న కార్యక్రమాలు ఫలితాలిస్తున్నాయని జనసేన నాయకుడు దాసరి రవిశంకర్ పేర్కొన్నారు. గ్రామాల్లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వినూత్న విధానాలను అమలు చేస్తోందని తెలిపారు.పల్లెల్లో మురుగు నీటి పారుదల వ్యవస్థల లేమి కారణంగా ప్రజలు అనారోగ్యకర పరిస్థితుల్లో జీవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు పరిష్కారంగా 'మ్యాజిక్ డ్రైన్స్' తరహాలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వీటి ద్వారా మురుగు నీరు తక్షణమే శుద్ధి చెయ్యబడి భూగర్భ జలాలుగా మారుతుందని వివరించారు.మూడంచెల ఫిల్టర్ బెడ్స్ ద్వారా నీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావడం వల్ల గ్రామాల్లో పరిశుభ్రత పెరగడంతో పాటు ఆరోగ్య సమస్యలు తగ్గుముఖం పడతాయని రవిశంకర్ తెలిపారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను అమలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## వెంకటేశ్వర డిగ్రీ కళాశాల మొదటి సెమిస్టర్ ఫలితాలలో ఫస్ట్ ర్యాంకులు



మైదుకూరు, మే 06, ప్రభాతవార్త:
యోగి వేమన విశ్వవిద్యాలయం మొదటి సెమిస్టర్ 2025, 26 ఫలితాలలో శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయ స్థాయిలో మొదటి ర్యాంకులను సాధించారు. బి.ఎస్‌సి కంప్యూటర్ సైన్స్ విభాగంలో పి. ప్రసన్న,ఎం. లక్ష్మి ప్రసన్నలు పదికి పది (10/10) గ్రేడ్ పాయింట్లు సాధించి విశ్వవిద్యాలయ ప్రథమ స్థానాన్ని పొందారు. అలాగే బి.ఎస్‌సి బోటనీ విభాగానికి చెందిన డి. సుష్మ,ఎస్. తాసిన్ సుల్తానా విద్యార్థినిలు కూడా 10/10 గ్రేడ్ పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. బి.కాం కంప్యూటర్స్ విభాగంలో ఎస్. నస్రీన్ కూడా 10/10 గ్రేడ్ పాయింట్లు సాధించి కళాశాలకు గౌరవం తీసుకువచ్చారు. ఇవే కాకుండా, 9.63 పైగా గ్రేడ్ పాయింట్లు సాధించిన 7 మంది విద్యార్థులు, 9.50 పైగా గ్రేడ్ పాయింట్లు సాధించిన 2 మంది విద్యార్థులు, 9.25 పైగా గ్రేడ్ పాయింట్లు సాధించిన 6 మంది విద్యార్థులు, 9.00 పైగా శాతం సాధించిన పలువురు విద్యార్థులు విశ్వవిద్యాలయ స్థాయిలో మంచి ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ డి. ఓబుల్ రెడ్డి, ఇంచార్జీ ప్రిన్సిపాల్ జగదీష్ విద్యార్థుల ప్రతిభను అభినందించారు. విద్యార్థుల విజయం వెనుక ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కృషిని కూడా ప్రశంసించారు.విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ కళాశాల యాజమాన్యం వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## జనగణన కిట్టు పంపిణీ



దువ్వూరు, మే 6, ప్రభాతవార్త:
మండల పరిధిలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణన సంబంధించి ఎన్యుమినేటర్లకు బుధవారం తహసిల్దార్ సంజీవరెడ్డి కిట్లను పంపిణీ చేశారు. ఎన్యుమినేటర్లు ఇళ్ల వద్దకు వెళ్లే సమయంలో వాటికి అవసరమైన పరికరాలన్నీ కిట్టులో భద్రపరిచామని వాటిని వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో పాల్గొనే ఎన్యుమినేటర్లు ఇళ్ల జాబితా ప్రకారం ఇళ్ల వద్దకు వెళ్లి వారి వివరాలు సేకరించాలన్నారు. ఈ నెల 30వ తేదీ లోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ జాన్సన్, ఎన్యుమినేటర్లు పాల్గొన్నారు.

## మొలకల పౌర్ణమి వేడుక.

తంబళ్లపల్లె మే6 ప్రభాతవార్త ః



మండలంలోని గుండ్లపల్లి పంచాయతీ దళితవాడలో మొలకల పౌర్ణమి పండుగ వేడుకగా చేసుకున్నారు. సందర్భంగా గ్రామంలోని మహిళలు నవధాన్యాలతో బోనం వండి బోనాలుఊరేగింపుగా గ్రామదేవతల కు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించి సంవృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండి పాడి పశువుల అభివృద్ధి చెందాలని గ్రామదేవతలకు మొక్కులు మొక్కుకున్నారు. అనంతరం నవధాన్యాలతో వేసిన మొలకను అమ్మవార్ల ముందు ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

## వై.వి.యు డిగ్రీ హానర్స్ సెమిస్టర్ ఫలితాలలో రాణి తిరుమల దేవి డిగ్రీ కాలేజ్ విజయభేరి



ప్రొద్దుటూరు అర్బన్, మే 6 ప్రభాతవార్త
స్థానిక రాణీ తిరుమల దేవి డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు 2026 ఫిబ్రవరి నెలలో యోగివేమన యూనివర్సిటీ నిర్వహించిన హానర్స్ డిగ్రీ ఒకటవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో చక్కటి ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో మంచిర్యాంకులు సాధించారు. వారిలో బీ.ఎస్సీ.బయోటెక్నాలజీ మొదటి సెమిస్టర్‌లో ఎస్. జె. హుమేర 10/10 పాయింట్స్ సాధించి మొదటి స్థానంలో నిలిచారు. అలాగే ఎస్. సమీరా 9.63, ఎన్. నౌస్మిన్ 9.63,సి. ధ్రువిత 9.63, కె. హాబీద ,9.25 పి.నరసింహ 9.25.ఫస్ట్ బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ హానర్స్ నందు వై. సుప్రజా 9.75, జీ .భవాని 9.63, ఎన్.ఎస్. అబ్దుల్ హమీద్ 9.13, ఎస్. నద 9.13. ఫస్ట్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ హానర్స్ నందు టీ.చెన్నకేశవరెడ్డి 9.63, ఎస్. నాగ నిఖిల 9.63, కె. భవ్యశ్రీ 9.63 ఎస్ .వహీదా 9.25, ఎస్. అలీషా 9.25, పి. వరలక్ష్మి 9.25, ఎస్.జహీర్ హుస్సేన్9.25 ఎస్ పౌజియా 9.25 లు అత్యధిక పాయింట్స్ సాధించారు. మంచి ప్రతిభ కనబరిచిన వీరిని కరెస్పాండెంట్ ఎల్. తరునేంద్ర శేఖర్, ప్రిన్సిపల్ టి. చంద్రశేఖర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అండ్ వైస్ ప్రిన్సిపల్ ఎస్. వెంకటేశ్వర్ రెడ్డి, సుబ్బారాయుడు, అధ్యాపకులు మరియు అధ్యాపకేతర బృందం వారిని అభినందించారు.

## ఇంటర్ ప్రవేశాలు ప్రారంభం

ఎడ్యుకేషన్ మే 6 ప్రభాతవార్త :
కడపలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో 2026, 27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. మే 5 నుంచి 10 వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని ప్రిన్సిపాల్ మునీష్ మీనా తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ గ్రూపులు అందుబాటులో ఉండగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ఐచ్ఛికంగా ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. కేవలం కేవీ విద్యార్థులు మాత్రమే కాకుండా, పదో తరగతి ఉత్తీర్ణులైన స్టేట్ బోర్డ్ మరియు ఇతర విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.మొత్తం 40 సీట్లు ఉండగా, సీబీఎస్ఈ విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య, డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఆధునిక ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.మరిన్ని వివరాలకు 7036156284, 08562225661 నంబర్లను సంప్రదించవచ్చు.

## నెలకో గ్రామం నాలుగు సందర్శనలు

యర్రగుంట్ల మే 6 ,ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్వహించనున్న నెలకో గ్రామం నాలుగు సందర్శనలు అనే కార్యక్రమాన్ని గురువారం యర్రగుంట్ల మండల పరిధిలోగల కర్చుకుంటపల్లెలో నిర్వహిస్తున్నట్లు యర్రగుంట్ల తాసిల్దార్ అమరేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామంలోని ఏవైనా భూసమస్యలు ఉంటే పరిష్కరించడం జరుగుతుందని గ్రామంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ సూచించారు.

## 2వ రోజు కొనసాగిన సీఐడీ విచారణ

- హైకోర్టు ఆగ్రహంతో కదిలిన యంత్రాంగం
- గత ప్రభుత్వంలో అనధికారికంగా వేసిన రోడ్డుపై విచారణ

ప్రొద్దుటూరు క్రైం, మే 6, ప్రభాతవార్త:



మున్సిపల్ అధికారులు అనుమతి లేఅవుట్‌కు 2021లో గత ప్రభుత్వంలో గోకుల్ నగర్ నుంచి వివేకానంద కాలేజీ రోడ్డు వరకు రోడ్డు నిర్మించారు. అక్కడ ఉన్న అనుమతి లేఅవుట్ నిర్మించిన కారణంగా 12 మంది హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో సీఐడీ జి.రవిశంకర్ అయ్యన్న ఆదేశాల మేరకు సీఐడీ అడిషనల్ డీజీ ఎస్పీ గంగాధర్ మంగళవారం సాయంత్రం ప్రొద్దుటూరు చేరుకొని తహసీల్దారు కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ విచారణకు ఆర్డీవో, తహసీల్దార్, ఏవోలు ఉన్నారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ రాధా ఎలా ఇచ్చారని ఈ రోడ్డు వేసేందుకు అనుమతి దానిపై విచారణ చేపట్టారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణ జరిగింది. ఇంకా 2, 3 రోజులు ఈ విచారణ జరుగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.

## శ్రామికుల సంఖ్యను పెంచాలి



దువ్వూరు, మే 06, ప్రభాతవార్త:
ఉపాధి హామీ పథకంలో మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో శ్రామికుల సంఖ్యను పెంచాలని డి.ఎల్.డి.వో రామాంజనేయులు, ఎంపీడీవో సుబ్బారెడ్డిలు అన్నారు. బుధవారం ఉపాధి హామీ పథకం పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం వేసవి సీజన్ అయినందున వ్యవసాయ పనులు కూడా తగ్గిపోయాయని అందువల్ల ఉపాధి హామీలో శ్రామికుల సంఖ్యను పెంచాలని అన్నారు. ఎప్పటికప్పుడు ఉపాధి హామీకి సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉంచాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో ఏపీఓ లక్ష్మీనారాయణ, ఈసీ ఇందిరా ప్రియాంక పాల్గొన్నారు.

## ఎగువపల్లెలో ఈ నెల 7న గ్రామసభ

పెండ్లిమర్రి, మే 6, ప్రభాతవార్త:
ఏపీ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వన్ మంత్ వన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 7న పెండ్లిమర్రి మండలంలోని ఎగువపల్లె గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందని మండల తహసీల్దారు తెలిపారు. రైతులు పాల్గొని తమ సమస్యలు పరిష్కరించుకొనే అవకాశం ఉందని కావునా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## మిషన్ ఎయిడ్స్ సురక్షను ప్రజల్లో ఆలోచింపచేయాలి

తంబళ్లపల్లె మే 6 ప్రభాతవార్త ః
మారుమూల ప్రాంతాలతో పాటు ప్రతి ఒక్కరూ మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమాన్ని ఆలోచింపజేసేలా అవగాహన పెంచి విజయవంతం చేయాలని కడప, అన్నమయ్య జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ మండలి (దిశ) క్లస్టర్ మేనేజర్ వేంపల్లి భాస్కర్ సూచించారు. బుధవారం ఆయన తంబళ్లపల్లె సిహెచ్సిలోని ఐ సి టి సి కేంద్రంతోపాటు ఎల్‌పసి ల్యాబ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సంతృప్తి చెంది హై రిస్క్ ఏరియాలను గుర్తించి హెచ్ఐవి పరీక్షలు చేయించడంతోపాటు హెచ్ఐవి తో జరిగే నష్టాలను వారికి వివరించి అవగాహన పెంచాలన్నారు. హెచ్ఐవి వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి పాజిటివ్ వచ్చిన వారిని ఏఆర్టీకి పంపి ఉచితంగా మందులు పంపిణీకి సహకరించాలన్నారు.

# పాడి రైతులకు గడ్డి కత్తిరించు యంత్రాలు రాయితీతో సరఫరా



**చిన్నమండెం మే 6 ప్రభాతవార్త:** మండలం లోని పాడి రైతులు వేసవిలో పశు గ్రాసకొరత రాకుండా గడ్డి కత్తరించు యంత్రాలను ఉపయోగించాలని మండల పశు వైద్యాధికారి డా.భాస్కర్ తెలియచేసారు. మండలంలో 14 యంత్రాలను రాయతీతో పంపిణీ చేశారు. వీటిని బుధవారం మండల టిడిపి అధ్యక్షులు ముగి రెడ్డెప్ప చేతుల మీదుగా మండలంలోని వివిధ గ్రామ పంచాయితీ లకు వచ్చిన 14 గడ్డి కత్తిరించు యంత్రాలను పాడి రైతులకు పశువైద్యశాల చిన్నమండెం ఆవరణలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ,చిన్నమండెం పశువైద్య సిబ్బంది, చిన్నమండెం గ్రామ అధ్యక్షులు రహంతుల్లా ఖాన్, టీడీపీ మండల మైనారిటీ అధ్యక్షులు రియాజ్ మరియు పాడి రైతులు పాల్గొన్నారు.

# మహిళలకు శక్తి యాప్ పై అవగాహన



**చిన్నమండెం మే 6 ప్రభాతవార్త:** చిన్నమండెం పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఎంపీడీవో ఆఫీస్ నందు బుధవారం మహిళా పోలీస్ స్టేషన్ సిఐ శంకర మల్లయ్య ఆధ్వర్యంలో శక్తి యాప్, పోక్సో యాక్ట్, సైబర్ నేరాలు, డ్రగ్స్ తీసుకోవడం వాల్ల కలిగే నష్టాలు గురించి మహిళలకు అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమం లోనే శక్తి యాప్ డౌన్లోడ్ చేయించడం అయినది. ఈ కార్యక్రమం లో రాయచోటి రూరల్ సిఐ రోషన్ చిన్నమండెం ఎస్.ఐ సుధాకర్, టీడీపీ మండల అధ్యక్షుడు ముగి రెడ్డెప్ప, సిడిపిఎస్ సూపర్వైజర్ సుగుణమ్మ. మండల మైనారిటీ లీడర్ రహంతుల్లా జీఎంఎస్కేలు, అంగన్వాడీ టీచర్స్, మరియు ఇతర సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

# మలేరియా వ్యాధి ప్రబలకుండా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించండి

## జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

**లక్కిరెడ్డిపల్లి మే 06 ప్రభాతవార్త** రాబోయే సీజన్లో వర్షాలు కురుస్తాయని దీంతో మలేరియా వ్యాధి ప్రబలకుండా గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు బుధవారం స్థానిక ఆసుపత్రిలో ఆరోగ్య కార్యకర్తలకు సమావేశ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల మజా ఆరోగ్య కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఆయన వివరించారు రాబోయే కాలంలో వర్షాలు కురుస్తాయని దీంతో గ్రామాలలో మురికినీరు అశుభ్రత పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించాలన్నారు గ్రామాలలో పశువులు వరలు మ్యాపులు ఉన్న ప్రాంతాలలో మురికి నీరు ప్రవహిస్తుందని అక్కడ దోమలు చేరి మలేరియా డెంగు చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయని ప్రజలకు పరిశుభ్రత గురించి పారిశుధ్యం గురించి అవగాహన కల్పించాలన్నారు ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించి మరుగు దొడ్లలోని తొట్లలో నీటిని శుభ్రం చేసి తొట్లను ఆరబెట్టాలన్నారు ఇక్కడే గాని మురికినీరు లేకుండా చూడాలన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్వో దానం ఎంపీహెచ్ఎస్ మహమ్మద్ భాష జిల్లా మలేరియా సభ్యులు, జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ శివ హెల్త్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్ అహ్మద్ రాంచంద్రారెడ్డి మల్లికార్జున ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# కాలువలో పడ్డ స్కూటర్ : ముగ్గురికి గాయాలు

## ఒకరి పరిస్థితి విషమం

**చౌడేపల్లి, మే 6 ప్రభాతవార్త** స్కూటర్ అదుపు తప్పి కాలువలో పడగా ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లికి చెందిన మునిరాజ (30), మంగమ్మ(26), మంజునాథ్(7)లు చౌడేపల్లి పరిధిలోని చిన్నకొండామర్రి సమీపంలో గల మామిడితోటలో వున్న బంధువుల ఇంటికి వచ్చారు. అనంతరం చెడుగుట్లపల్లి మీదుగా పెద్దకొండామర్రికి టూవీలర్ ద్వారా బయలుదేరారు. మార్గమధ్యంలో స్కూటర్ అదుపుతప్పి పక్కనే కాలువలో పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108సేవల ద్వారా మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో బాలుడు సంతోష్ ఆరోగ్య పరిస్థితి విషమంగా వున్నట్లు వైద్యులు ధృవీకరించారు.



చికిత్స పొందుతున్న బాలుడు

# కిశోర వికాసం బాలికలపై సిడిపిఓ అవగాహన సదస్సు

**పెద్దమండెం మే 6 ప్రభాతవార్త** మండలంలో మే 1 నుండి జూన్ 9 వరకు ఉషారావికాసం బాలికలపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు సిడిపిఓ సుజాత అన్నారు బుధవారం మండలంలోని 11 నుండి 18 సంవత్సరాల వయసుగల బాలికలకు సమ్మర్ క్యాలండర్ పై అవగాహన కల్పించారు జీవన నైపుణ్యాలు స్కిల్స్ ఆరోగ్యమేల చట్టాలపై అవగాహన ఆర్టిఏ చట్టంపై ప్రాముఖ్యత లైంగిక పునరుత్పత్తి ఆరోగ్యం ఎయిడ్స్ పై అవగాహన శారీరక వ్యాయామం స్మార్ట్ ఫోన్ల వినియోగం సైబర్ నేరాలు ఆన్లైన్ భద్రత పై అవగాహన కల్పించారు పిల్లలు బాల్య వివాహాల నివారణపైపై ప్రత్యేక శుద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పై వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిపై తగు జాగ్రత్తగా వ్యవహరించాలని వాటి గురించి క్లుప్తంగా తెలుసుకుని మసులుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కిశోర బాలికలు సూపర్వైజర్లు బేగం నాగలక్ష్మి ప్రభావతి చంద్రకాంత్ బి పి స రెడ్డి భాష తదితరులు పాల్గొన్నారు,



# టివికే ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు చారిత్రాత్మక అడుగు

## ఎన్ఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ



రాహుల్ గాంధీతో అమృత తేజ ఫైల్ ఫోటో

**పీలేరు, మే 6 ప్రభాతవార్త** తమిళనాడు ప్రజలు స్పష్టమైన తీర్పును గౌరవిస్తూ, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ, తమిళగ వెట్రి కళగం (టివికే) ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ప్రకటించడం పట్ల ఎన్ఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ, లౌకిక, ప్రగతిశీల మరియు రాజ్యాంగ విలువలను కాపాడే ప్రభుత్వ ఏర్పాటుకు ఇది ఒక ముఖ్యమైన అడుగు అని పేర్కొన్నారు. ముఖ్యం గా యువత ఆశయాలకు అనుగుణంగా తీసుకున్న ఈ నిర్ణయం దేశ రాజకీయాల్లో సానుకూల మార్పుకు దారి తీస్తుందని అన్నారు. రాజ్యాంగాన్ని నమ్మని కమ్యూనల్ శక్తులను కూటమి నుండి దూరంగా ఉంచాలని పెట్టిన షరతు ప్రజాస్వామ్య రక్షణకు కీలకమని ఆయన స్పష్టం చేశారు. తమిళనాడులో సామాజిక న్యాయం, సమానత్వం మరియు సమగ్ర అభివృద్ధి సాధనకు ఈ కూటమి కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "రాహుల్ గాంధీ గారి నాయకత్వం దేశ యువతలో నమ్మకాన్ని మరింత బలపరుస్తూ, రాజ్యాంగ విలువల పరిరక్షణలో కీలకమైన పాత్రను పోషిస్తోంది" అని అన్నారు. ముఖ్యంగా యువతకు న్యాయం చేసే, వారి ఆశయాలను నెరవేర్చే ప్రభుత్వంగా ఈ కూటమి నిలవాలని ఆకాంక్షించారు.

# టిడిపి కుటుంబానికి నాయకుల చేయూత



**తంబళ్లపల్లె మే 6 ప్రభాతవార్త :** మండలంలోని కోసువారి పల్లి పంచాయతీ వడ్డిపల్లి కు చెందిన టిడిపి నాయకుడు లక్ష్మన్న కుమార్తె నారాయణమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో స్థానిక టిడిపి నేతలు తీవ్రంగా స్పందించి ఆర్థికంగా చేయూతనందించారు. టిడిపి నాయకుడు సీడ్ మల్లికార్జున నాయుడు రూ5000, రాజంపేట తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్రమోహన్ రూ 2000, కన్నె మడుగు రేపన బాబు రూ 2000, మరియు చెరువు సంఘం అధ్యక్షుడు ఆదిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటరమణ, ఆనంద నాయుడు, ఉప్పుతోళ్ల శివరాం, రవి, కృష్ణమూర్తిలు రూ 6000 మొత్తం రూ 15000 ఆర్థిక సాయం అందించి ప్రభుత్వపరంగా ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టిడిపి నాయకులు చేసిన ఆర్థిక వితరణ పై లక్ష్మన్న తో పాటు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలకు రెండో విడత ఫలితాలు విడుదల





**మదనపల్లెక్రైమ్, మే ప్రభాతవార్త.** 2026-2027 విద్యాసంవత్సరానికి సంబంధించి, ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కల్పించే 25 శాతం ఉచిత ప్రవేశాల కోసం రెండవ విడత లాటరీ ఫలితాలను జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ) డా. నున్నా అనూరాధ విడుదల చేశారు. జిల్లాలో ఈ రెండవ విడత లాటరీ ద్వారా పలు ప్రైవేట్ పాఠశాలల్లో 156 మంది విద్యార్థులకు ఉచిత సీట్లు కేటాయించినట్లు ఆమె పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపడం జరిగిందన్నారు. అలాగే అభ్యర్థులు హెచ్ టిటిఎస్://సిఎస్ఈ.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా వివరాలను తెలుసుకోవచ్చన్నారు. దీంతో పాటు సంబంధిత మండల విద్యాశాఖ కార్యాలయాల నోటీసు బోర్డులపై కూడా ఫలితాలను ప్రదర్శించడం జరిగిందన్నారు. మొదటి విడతలో 465 మందికి సీట్లు కేటాయించగా, అందులో 386 మంది విద్యార్థులు ఇప్పటికే పాఠశాలల్లో చేరారని ఏపీసీ తెలిపారు. రెండో జాబితాలో ఎంపికైన విద్యార్థులు తమ ప్రవేశాన్ని ఖరారు చేసుకోవడానికి ఈ నెల 17వ తేదీలోపు సంబంధిత పాఠశాలలను సంప్రదించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు, విద్యార్థి జనన ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, స్టడీ సర్టిఫికేట్లు తీసుకొని రావాలన్నారు. ప్రవేశాలు లేదా ఇతర సందేహాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800 425 8580 ను సంప్రదించాలని ఏపీసీ సూచించారు.

# రోడ్డు వేశారువేస్ట్ మట్టి మరిచారు

**రాయచోటి మే 6 ప్రభాతవార్త** రోడ్డు వేశారు మట్టిని మరిచారు రాయచోటి మున్సిపల్ అధికారులు నిర్వాహకం అంటున్న స్థానిక ప్రజలు. అన్నమయ్య జిల్లా రాయచోటి బస్టాండ్ రహదారిలోని బంగ్లా సర్కిల్ నుండి బస్టాండ్ వరకు రోడ్డు వేశారు కానీ రోడ్డు వేసేటప్పుడు తీసిన వేస్ట్ మట్టిని ఎత్తడం అలాగే వదిలేశారు. సిమెంటు రోడ్డు మీద కట్టిన పాదలను కూడా అలాగే వదిలేసిన కాంట్రాక్టర్ , మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదు.వేస్ట్ మట్టి మరియురాళ్లు అలాగే రోడ్డుపై ఉండడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతున్న అటు కాంట్రాక్టర్ కానీ ఇటు మున్సిపల్ అధికారులు గానీ పట్టించుకోని పాపాన పోలేదు. దీనితో ద్విచక్ర వాహనాలు రోడ్డుపైన పార్కు చేయడంతో బస్టాండుకు వెళ్లే బస్సులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.వాహనదారులకు ,పాదాచారులకు ప్రమాదాలు జరగక ముందే మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుపై పడ వేసిన వేస్ట్ మట్టిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని వివరణ కోరగా కొత్తగా నిర్మించిన రోడ్డు క్యూరింగ్ నిమిత్తమై రోడ్డుపై సిమెంటు పాదులు ఏర్పాటుచేసి అందులో నీరు నింపుతున్నందువలన సకాలంలో సిమెంటు పాదులను తీసివేలేక పోతున్నామని ఆయన తెలిపారు. క్యూరింగ్ దినాలు అయిన తర్వాత సిమెంట్ పాదులను మరియు అక్కడికి గాలితో చేరి నటువంటి మట్టిని తొలగిస్తామని ఆయన పేర్కొన్నారు.

# మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



**రామసముద్రం మే 6 ప్రభాతవార్త** నిర్లక్ష్యంతో ముందస్తు జాగ్రత్త పాటించకుండా విద్యుత్ మరమ్మతులు చేపట్టడంతో విద్యుత్ సిబ్బంది, ప్రజలు ప్రాణాలు కోల్పవడాన్ని అరికట్టెందుకు అప్రమత్తంగా వ్యవహరించాలని తిరుపతి చీఫ్ విజిలెన్స్ అధికారి జనార్ధనాయుడు, తిరుపతి విజిలెన్స్ ఏపీ టీ ఎస్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం రెడ్డి ఉత్తర్వులు మేరకు విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, ఏ ఈ మస్తాన్ వల్లి ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయంలో సిబ్బందికి, రైతులకు అవగాహన శిబిరం బుధవారం నిర్వహించారు. వేణుగోపాల్, ఏ ఈ మస్తాన్ వల్లి మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు అరికట్టెవిధంగా అప్రమత్తంగా విద్యుత్ స్థంబాలు ఎక్కడం, విద్యుత్ నియత్రించి మరమ్మతులు చేపట్టడం తప్పని సరని, చేతులకు గ్లౌస్ లు ధరించడం, తాడు కట్టుకుని స్థంభం ఎక్కాలని సింబందికి తెలియజేసారు. విద్యుత్ ప్రమాదాలు అరికట్టడం పై సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. వర్షాకాలం లో విద్యుత్ మోటార్లు దగ్గర రైతులు జాగ్రత్తగా ఉండాలని ఏదైనా విద్యుత్ సమస్యలు ఉంటే విద్యుత్ కార్యాలయ సిబ్బందికి తెలియజేసారు.మండలంలో ఎక్కువగా జనసంచారం ఉన్న ప్రదేశాలు, తాహిసీల్దార్ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయాల్లో ప్రమాదాలు ఎలా జరుతాయి ప్రభుత్వం ముద్రించిన గోడపత్రికలను అట్టించడం జరిగింది.ఈ కార్యక్రమంలో విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, ఏఈ మస్తాన్ వల్లి, విద్యుత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**చిన్నమండెం, మే 6, ప్రభాతవార్త:** మండలంలోని దేవగుడిపల్లి గ్రామ కస్పాకు చెందిన కేసం సుధాకర బుధవారం ఉదయం 5 గంటల సమయంలో రాయచోటి మదనపల్లి రహదారిలో దేవగుడిపల్లి సమీపంలో ఆర్చి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని మృతి చెందాడు. వివరాలలోకి వెళితే సుధాకర్ ప్రతి రోజు తెల్లవారుజామునే చిన్నమండెం వెళ్లడం జరుగుతుంది. ఈ క్రమంలో బుధవారం సుధాకర్ మరొక వ్యక్తి కుర్వపల్లికి చెందిన రామచంద్ర నడుచుకుంటూ వెళ్తుండగా రాయచోటి వైపు నుంచి మదన పల్లి వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సుధాకర్ కు తలకు బలమైన గాయాలయ్యాయి.సుధాకర రామచంద్ర పై పాదంతో అతను దూరంగా పడ్డాడు.అతనికి యలాంటి గాయాలు కాలేదు.సుధాకర్ ను వెంటనే రాయచోటి ఆసుపత్రికి తరలించారు.అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు తెలిపారు.మృతునికి భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.ఇతని మృతి తో వారి కుటుంబం శోకసంద్రంలో మునిగింది.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. సుధాకర్ తెలిపారు.

# కూటమి నాయకుల చిత్ర పటాలకు చేనేతల పాలాభిషేకం



**తంబళ్లపల్లె, మే 6, ప్రభాతవార్త :** ప్రభుత్వం ఇచ్చిన హామీలు భాగంగా చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఏర్పాటు జరిగింది. ఇందుకు కృతజ్ఞతలు చేనేత కార్మికులు బుధవారం కూటమి నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించా రు. ఉదయం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బిజెపి సీనియర్ నాయ కుడు మగ్గాలు లక్ష్మయ్య, టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి,చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శినాగార్జున,చేనేత సంఘ మండల అధ్యక్షుడు రేపన మల్లికార్జున, సాంబశివారెడ్డిల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి అనంతరం భారీ కేక్ కట్ చేసి చేనేత కార్మికులకు పంచిపెట్టారు. మండలంలో సుమారు 74 మంది చేనేత కార్మికులు, 12 మంది మరమగ్గాల లబ్ధిదా రులకు ఉచిత విద్యుత్తు అందుతోందని కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎల్ఐ భాస్కర్, లైన్మెన్ శంకర్, టిడిపి నాయకులు పురుషోత్తం, కాల నారాయణ, బాజీ జడ్పిటిసి రామచంద్ర, మ్యూజికల్ శివ, మధు నాయుడు, దండు రమణ, బిజెపి నాయకులు శంకర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, జనసేన నాయకులు బండి మురళీకృష్ణ, రాజా రెడ్డి, చేనేత కార్మికులు నరసింహులు, రాజా రమేష్, వెంకటరమణ, శివ శంకర్, నరసింహారెడ్డి, మధుకర్‌రెడ్డి, జయరాం తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై దాడులును తీవ్రంగా ఖండిస్తున్నాం



**పీలేరు మే 6 ప్రభాతవార్త:** జర్నలిస్టులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని అనంతపురం మనం విలేకరి లక్ష్మీ ్మ నారాయణపై శ్రీ గీతం జూనియర్ కళాశాల యాజమాన్య రాలు మనీ షా నాయర్ విలేఖరి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి అతని చేత కాళ్ల పట్టించుకోవడం హేయమైన చర్య అని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని ఇలాంటి దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎక్కడ ఎప్పుడు ఏ జర్నలిస్టు పైన దాడులు జరిగినా పీలేరు ప్రెస్ క్లబ్ సభ్యులు ఐకమత్యంగా ఉండి ఎదుర్కొంటామని జర్నలిస్టులపై దాడులు చేసే వారిని ఉపేక్షించరాదని కోరుతూ బుధవారం పీలేరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తహసిల్దార్ శివకుమార్ కు, అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ యుగంధర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు ప్రెస్ క్లబ్ సభ్యులు మల్లెలజాకీర్, ఖాదర్ బాషా చంద్రశేఖర్ రాజు, జాకీర్, నంద్యాల నాగరాజా, రామాంజులు, సురేంద్ర, వెంకటేష్, అల్తాఫ్ మయూర్నాథ్,సుఫి రవికిషోర్, తులసికృష్ణ శ్రీనాథ్, శ్రీరాములు రాజు

# వేసవి శిక్షణ శిబిరంలో కాగితంతో బొమ్మల తయారీ కార్యక్రమం



**రాయచోటి మే 6 ప్రభాతవార్త :** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని విజ్ఞాన్ స్కూల్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరిగామి నిపుణుడు రాజశేఖర్ విద్యార్థుల చేత కాగితంతో వివిధ రకాల అలంకరణ వస్తువులు, బొమ్మలు తయారు చేయించి వారికి సృజనాత్మక నైపుణ్యాలను పరిచయం చేశారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం తెలుగు భాషపై ఆసక్తి పెంపొందించేందుకు కళావతి విద్యార్థులతో తెలుగు పదాల ఆధారంగా పజిల్స్, భాషా ఆటలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో తెలుగు భాష పట్ల అభిరుచిని పెంచడంతో పాటు ఆలోచనా శక్తిని అభివృద్ధి చేస్తాయని ఆమె తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం మరియు భాషా నైపుణ్యాల పెంపొందన లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం పూర్తిగా ఉచితమని, పట్టణంలోని పాఠశాల విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు బయారెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, ఆంజనేయులు, రామయ్య, ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



**పీలేరు మే 6 ప్రభాతవార్త:** మండలంలో భూసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తహశీల్దార్ ఎం. శివకుమార్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా ఒక గ్రామంలో నాలుగు సార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని ఆవులవారిపల్లెలో గురువారం రెవెన్యూ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ సమావేశాన్ని సద్వినియోగం చేసుకొని ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

# అతిగా మద్యం సేవించి ఇద్దరు మృతి

**మొలకలచెరువు మే 6 ప్రభాతవార్త** అతిగా మద్యం సేవించి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన మద్దయ్యగారిపల్లె గ్రామం లో బుధవారం చోటు చేసుకుంది గ్రామస్థుల అత్తానం మేరకు వివరాలిలా ఉన్నాయి మంగళవారం నుండి గంగమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు.గ్రామానికి చెందిన కొత్తకోట శంకర 55అతిగా మద్యం సేవించి ఇంట్లోనే మృతిచెందాడన్నారు .అదేగ్రామానికి చెందిన శామీర్ బాషా 52ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడన్నారు. భార్య వదిలి వెళ్లిపోవడంతో మద్యానికి బానిసయ్యాడన్నారు .అనారోగ్యానికి గురైన శామీర్ మద్యం ఎక్కువగా సేవించి అపస్మారక స్థితికి చేరుకోవడం తో కుటుంబీకులు 108గ్రామం వాహనం లో బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యం లో మృతి చెందాడన్నారు .గ్రామం లో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట ప్రారంభించిన రెండు రోజుల్లో ముగ్గురు మృతి చెందడం తో గ్రామం లో భయాందోళను వ్యక్తం చేస్తున్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి

## డిసిహెచ్ఎస్ లక్ష్మీ ్మ ప్రసాద్



రోగులతో మాట్లాడుతున్న డి సి హెచ్ ఎస్ డాక్టర్ లక్ష్మీ ్మప్రసాద్

**లక్కిరెడ్డిపల్లి మే 06 ప్రభాతవార్త** వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బీసీ హెచ్ ఎస్ డాక్టర్ లక్ష్మీ ్మ ప్రసాద్ పేర్కొన్నారు బుధవారం లక్కిరెడ్డిపల్లి కమ్యూనిటీ ఆసుపత్రులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు సందర్భంగా ల్యా బ్ టెక్నిక్ ఎక్స రే ఆపరేషన్ల గదలను ఆయన పరిశీలించారు. అనంతరం రోగుల తో మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా అని అడిగి తెలుసు కున్నారు. రోగులకు మధ్యాహ్న సమయంలో భోజనం ఏర్పాటు చేస్తున్నారా లేదా అని సిబ్బంది అడిగి తెలుసుకున్నారు 30 పడగల ఆసుపత్రిని ప్రభుత్వ అన్ని వసతులు కల్పించిందని వీటిని ఉపయోగించి సామాన్యంతో రోగులకు మెరు గైన వైద్య సేవల నుంచి రోహిణి ఇతర ప్రాంతాలకు తరలించకుండా సాధ్య మైనంత వరకు చికిత్స చేయాలన్నారు 24 గంటలు అందుబాటులో ఉన్నామని డాక్టర్లు డి సి హెచ్ ఎస్ దృష్టికి తీసుకెళ్లారు స్పందించిన ఆయన ప్రజలకు మంచి తాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఎన్ఎస్ ప్రసాద్, సులో చన, శివ ప్రసాద్ హిందూజ

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతి చెందిన పకీరమ్మ

**లక్కిరెడ్డిపల్లి మే 06, ప్రభాతవార్త** కేంద్రమైన లక్కిరెడ్డిపల్లి చింతకుంట వాళ్ళపల్లి మధ్యలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పకీరమ్మ (70) అనే మహిళ మృతి చెందినట్లు ఎస్సై గోల్కొండ శోభ తెలిపారు ఎస్ఐ వివరాలు మేరకు కే.పకీరమ్మ కోనంపేట పంచాయతీలోని కాలాడివాళ్ల పల్లకి చెందినదని ఉదయాన్నే ఉపాధి పని చేసుకుని మధ్యాహ్నం బ్యాంకులో అగ్రికల్చర్ సంబంధించిన బ్యాంకులో పని పూర్తి చేసుకొని కూరగాయలు తీసుకొని కాలాడేవాళ్ళ పల్లెకు వెళ్తుండగా కోనంపేట నుంచి ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే రెండు కాళ్లు చేతులు ఇరిగి మృత్యువాత పడిందని ఆమె తెలిపారు ఈ మేరకు కార్ డ్రైవర్ పై కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

# వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ధరఖాస్తుల ఆహ్వానం

**చౌడేపల్లి, మే 6 ప్రభాతవార్త** ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విద్యాలయంలో ప్రవేశము కొరకు ధరఖాస్తుల ఆహ్వానం చేసుకోవాలని ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ కోరారు. ఆయన స్థానికంగా మాట్లాడుతూ పుంగనూరు పరిధిలోని కళాశాలకు ఈనెల 21వరకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు డిప్లొమాలో ప్రవేశము కొరకు అర్హులన్నారు. రెండు సంవత్సరములు కోర్సు కాల వ్యవధిలో ఇంగ్లీష్ మీడియంలో బోధన వుంటుందన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో చేర్చేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆసక్తి చూపాలన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఎన్‌జిఆర్ఎయు.ఎసి.ఇన్, 9381359956లో సంప్రందించాలన్నారు.

# 9,10 తేదీల్లో చౌడేశ్వరీ దేవి తిరుణాల



**గాలివీడు, మే 6, ప్రభాతవార్త:** మండలంలోని పూలుకుంట గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి తిరుణాల (జ్యోతులు) ఈ నెల 9, 10 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. జాతర ఏర్పాట్లు పూర్తి స్థాయిలో కొనసాగుతున్నాయని వారు పేర్కొన్నారు. జాతర కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 8వ తేదీ శుక్రవారం ఉత్సవ మూర్తిని గ్రామంలోని 11 పల్లెలకు తీసుకెళ్లి గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నారు. అనంతరం 9వ తేదీన నిండు తిరునాల, 10వ తేదీన మైల తిరునాల నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ జాతర సందర్భంగా పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందని గ్రామ పెద్దలు తెలిపారు. భక్తుల కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# గ్రంధాలయంలోవేసవి శిక్షణ శిబిరాలు



యోగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

**పీలేరు మే 6 ప్రభాతవార్త:** స్థానిక గ్రంధాలయంలో వేసవి శిక్షణ శిబిరాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించామని గ్రంధాలయఅధికారి అమరనాధ్ తెలిపారు. బుధవారం పీలేరు ద్వితీయ శ్రేణి శాఖ గ్రంధాలయము నందు వేసవి శిక్షణ శిబిరాల కార్యక్రమాలలో భాగంగా, పిల్లలు మరియు తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. పిల్లలు వారి అభిరుచుల మేరకు కథలు చదవడం, కథలు చెప్పడం, చిత్రలేఖనం, చెస్, క్యారమ్స్. యోగ సాధన, డాన్స్ కార్యక్రమాలతో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు., పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడం గ్రంధాలయాల ప్రాముఖ్యతను తెలియజేయడం దీని ముఖ్య ఉద్దేశ్యమని అయన తెలిపారు. యోగా మాస్టర్ లతచే యోగా సాధన, మరియు సంగీత మాస్టారు లక్ష్మీ శ్రీనివాసులు వారిచే సంగీత శిక్షణ ఇవ్వబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిడిసిఎల్.పి. మంజుల, సహాయకులు డి. వెంకటేష్ పాఠకులు పాల్గొన్నారు.

# ఉర్దూ అకాడమిచే ఉచిత కోచింగ్ శిబిరం

## రాష్ట్ర ఉర్దూ అకాడమి వైస్‌ఛైర్మెన్



**మదనపల్లె, మే 6 ప్రభాతవార్త :** రాష్ట్ర ఉర్దూ అకాడమి ఆధ్వర్యంలో ఉర్దూభాషా అభివృద్ధి కోసం ఉచిత కోచింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వైస్‌ఛైర్మెన్ పఠాన్‌ఖాదర్‌ఖాన్ తెలిపారు. బుధవారం ఉర్దూ కోచింగ్ నిర్వహణపై ఆఓ ఉర్దూ సిఖే-రండి ఉర్దూ నేర్చుకుందాం అనే పుస్తకాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఛైర్మెన్ మహమ్మద్‌ఫరూఖ్ సారధ్యంలో ఈ ఉచిత క్యాంపును మే 23వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మదనపల్లె, తంబళ్ళపల్లె నియోజకవర్గాల్లో ఈక్యాంపును నిర్వహిస్తామన్నారు. ఉర్దూభాషాభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్‌సప్లై డైరెక్టర్ పర్వీన్‌తాజ్, షేక్ అయూబ్‌బాషా,సాజిద్, మస్తాన్, ఉర్దూ అకాడమి సిబ్బంది, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి మండిపల్లిపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న రెడ్డయ్య యాదవ్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి

**లక్కిరెడ్డిపల్లి మే 06, ప్రభాతవార్త**

రాయచోటిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి కుటుంబంపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని రాష్ట్ర అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రగోళ్ల రెడ్డయ్య యాదవ్, డిసిసిబి మాజీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు బుధవారం వారు లక్కిరెడ్డిపల్లిలో వారు విలేకరులతో మాట్లాడుతూ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలి అన్నారు. దశరథ రామిరెడ్డి ఘర్షణలో మంత్రి కుటుంబ సభ్యులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. విశ్రాంతి ఉద్యోగైన ఆదినారాయణ రెడ్డి స్థలం తనదని కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్న విషయం అందరికీ తెలుసు అన్నారు అయితే ఆదినారాయణ రెడ్డి దశరథరామిరెడ్డి ఇరువురు ఘర్షణ పడడంతో ఆ ఘర్షలతో దశరథ రామ్ రెడ్డి గాయపడ్డారని ఈ ఘర్షణకు మడ్డిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఆయన మేనల్లుడు మోర్య రెడ్డి తమ్ముడు లక్ష్మి ప్రసాద్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు ఆరోజు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొల్లు పార్థసారథి ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనాలని వారు గుర్తు చేశారు గతంలో రాయచోటి ప్రాంతంలో ఎవరు అన్యాయంగా అక్రమాలుగా స్థలాలు దోచుకున్నారో ప్రజలకు తెలుసు అన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బడుగు వాసుదేవుడు గురుమూర్తి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## నిండు వేసవిలో ఆహ్లాదానిస్తున్న మెహర్ పూలు


రోడ్డు కిరువైపులా వున్న ఎర్రపూలు

**చౌడేపల్లి, మే 6 ప్రభాతవార్త**

ప్రకృతి పురివిప్పాలే కానీ ఆస్వాదించే మనసులకు పండగే...నిండు వేసవిలో రోడ్డుకిరువైపులా ఎర్రటిపూలు పూసిన చెట్లు ప్రకృతి ప్రియులకు కనువిందు చేస్తున్నాయి. చౌడేపల్లి-పుంగనూరు ప్రధాన రహదారిలో చింతమాకులపల్లి వద్ద విరగ్గాసిన మెహర్(ఎర్ర)పూల చెట్లను మనం చూస్తున్నాం. " కొంత సేపు కూర్చొని వెళ్ళొచ్చుగా " అన్నట్లు ఈ చెట్లు వాహనచోదకులను పలకరిస్తున్నాయి.

## ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో వికసించిన కుసుమం అర్పిత


ఎమ్మెల్యే చేతుల మీదుగా మేమేంటోను అనుకుంటున్న విద్యార్థి

**పీలేరు మే 6 ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలలో లక్షల రూపాయల ఖర్చుపెట్టి చదివిస్తున్న ఈ రోజులలో ప్రైవేట్ కళాశాలలో ప్రైవేటు పాఠశాలల్లో చదివించలేని స్తోమత లేని నిరుపేద తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించిన అర్పిత ప్రభుత్వ గర్ల్స్ హై స్కూల్ కలికిరిలో 10 వ తరగతిలో మార్కులు 600 గాను 580 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలో అధిక మార్కులు సాధించి వికసించిన హర్పితకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి గ్రామం నగిరిపల్లిలో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ ఆధ్వర్యంలో అర్పిత తల్లిదండ్రులు రాజీవ్ కుమార్ ఇంద్రాణి సమక్షంలో మెరిట్ సర్టిఫికెట్‌ను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అష్ట కష్టాలు పడి తండ్రి తల్లి బాధలను గుర్తించి చదువులలో ప్రైవేట్ పాఠశాలల్లోనే కాదు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా విద్యను అభ్యసించి తల్లిదండ్రుల కోరిక నెరవేరుస్తానని తెలిపారు.

## ప్యారంపల్లిలో భూ సమస్యలపై ప్రత్యేక సమావేశం



**గాలివీడు, మే.6.ప్రభాతవార్త:**

వన్ మంత్-వన్ విలేజ్-ఫోర్ విజిట్స్" కార్యక్రమం పరిధిలో భాగంగా రీసర్వే చేసిన గ్రామాల్లో ఉత్పన్నమైన భూసమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు మే 7న ప్యారంపల్లి గ్రామంలోని రెడ్డివారి పల్లె ఎంపియూ పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భాగ్యలత తెలిపారు.ఈ సమావేశానికి తహసీల్దార్, ఎంపీ డీవో, ఆర్ఐ, మండల సర్వేయర్, వీఆర్ఓ, వీఎస్ తదితర సంబంధిత అధికారులు హాజరుకా నున్నారు.గ్రామస్థులు తమ భూ సంబంధిత సమ స్యలను నేరుగా అధికారులకు వినిపించే అవకాశం కల్పించనున్నారు. రీసర్వే అనంతరం ఏర్పడిన వివాదాలు, సరిహద్దు సమస్యలు, రికార్డు లోపాలు వంటి అంశాలను ఈ సమావేశంలో స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

# అన్నమయ్య జిల్లాలో విషాదం

### పీటీఎం మండలంలో ఇద్దరు మృతి
### మద్యంపై అనుమానాలు

**మదనపల్లెక్రైమ్, మే 6 ప్రభాతవార్త.**

అన్నమయ్య జిల్లా పీటీఎం మండలం, మద్దయ్యగారి పల్లెలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. మృతులను అదే గ్రామానికి చెందిన శంకరప్ప, షామీర్‌లుగా గుర్తించారు. వీరిద్దరూ వృత్తిరీత్యా బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం వీరు ఒకరి తర్వాత ఒకరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. మృతులు గ్రామంలోనే ఉన్న బెల్ట్ షాపులో మద్యం కొనుగోలు చేసి తాగిన తర్వాతే మరణించారని, దీనివల్లనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలియడంతో ఎక్సైజ్ శాఖ అప్రమత్తమైంది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి. మధుసూదన్ వెంటనే స్పందించి, సంఘటనా స్థలానికి బయలుదేరారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. మరణానికి గల ఖచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక, వైద్య పరీక్షల అనంతరం తెలియాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపడుతున్నట్లు సమాచారం.

# సమాజ భాగస్వామ్యంతోనే డెంగీ నియంత్రిద్దాం

### డిప్యూటీ హెచ్ఈఓ

**మదనపల్లెక్రైమ్, మే ప్రభాతవార్త.**



సమాజ భాగస్వామ్యంతోనే డెంగీ జ్వరాలను నియంత్రణ చేయవచ్చని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. డిఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మి నరసయ్య ఆదేశాలతో బుధవారం డెంగీ, విష జ్వరాల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రామారావు కాలనీ, ముజీబ్ నగర్ లలో దోమల ద్వారా వ్యాప్తి చెందు వ్యాధులు వాటి పర్యవసానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం వల్ల కలుగు ప్రయోజనాలను వివరించారు. డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్ గున్య , మెదడు వాపు రకాల జ్వరాలు ప్రజారోగ్యానికి ప్రమాదం అన్నారు. ఇటీవలే ప్రభుత్వం మలేరియా వ్యాధిని నోటిఫైయబల్ డిసీస్ గా గుర్తింతించిందని, తీవ్ర జ్వరం, చలి, తలనొప్పి, నీరసం, వాంతులు, వికారం, కనుగుడ్లు పక్కకు తిప్పలేకపోవడం, శరీరం పై దద్దులు, రక్తకణాల సంఖ్య తగ్గిపోవడం, కీళ్లనొప్పులు వంటి లక్షణాలు ఈ జ్వరాలలో కనిపిస్తాయని సూచించారు. వ్యాధి లక్షణాలు ను బట్టి రక్త పరీక్షలు చేయించుకుని, సకాలంలో చికిత్స పొందితే ప్రాణాపాయం ఉండదని తెలిపారు. దోమల నిర్మూలన కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ఉంటేనే దోమలపై దండయాత్ర విజయవంతం అవుతుందన్నారు. అనంతరం ప్లేకార్డ్స్ ప్రదర్శన, కరపత్రాల పంపిణి చేశారు. వడ దెబ్బ కు గురి కాకుండా తీసుకోవాల్సి న జాగ్రత్తలు, ఓ. ఆర్. ఎస్. పాకెట్స్ ఎలా వాడుకోవాలి, ఎక్కడ దొరుకుతాయో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్ లావణ్య, హెల్త్ అసిస్టెంట్ కిరణ్, వార్డ్ ఏమినిటీస్ సెక్రటరీ జియాల్లా, ఆశా కార్యకర్త మల్లీశ్వరి పాల్గొన్నారు.

## తిరుమలరెడ్డిపల్లి మహిళకు మళ్లీ దక్కిన అరుదైన గౌరవం

### టిటిడి ఆస్థాన విధ్వంసరాలుగా పద్మశ్రీ డాక్టర్ శోభారాజు నియామకం

**మదనపల్లి, మే 6 ప్రభాతవార్త**



అన్నమయ్య జిల్లా, మదనపల్లి నియోజకవర్గం, రామసముద్రం మండలం, తిరుమలరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ డాక్టర్ శోభ రాజును తిరుమల తిరుపతి(టీటీడీ) ఆస్థాన విధ్వంసరాలుగా నియమించారు. బుధవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో టిటిడి బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిటిడి చైర్మన్ బి ఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, బోర్డు సభ్యులు అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా గత 40 సంవత్సరాలుగా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి, అన్నమాచార్య, తరి గొండ వెంగమాంబ కీర్తనలకే పరిమితమైన పద్మశ్రీ డాక్టర్ శోభారాజును తిరిగి టీటీడీ ఆస్థాన విధంశాలుగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రామసముద్రం మండలం, తిరుమలరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీటీడీ ప్రధాన ఆలయ అధికారి స్వర్గీయ ఆర్ జి నారాయణ రాజు, రాజ్యలక్ష్మీ దంపతుల కుమార్తె అయిన డాక్టర్ శోభారాజు చిన్నతనం నుండి సంగీతంలో ప్రావీణ్యం పొందారు. తొలుత తన తల్లి ద్వారా శోభా రాజు సంగీతాన్ని నేర్చుకున్నారు. తిరుపతిలో విద్యాభ్యాసం చేస్తూ మ్యూజిక్ కళాశాలలో గాయనిగా శిక్షణ పొందారు. ఆ తరువాత ప్రముఖ సంగీత కళాకారులు నుండి శిక్షణ తీసుకున్నారు. అక్కడి నుండి మొదలైన తన తీయ్యటి స్వరాన్ని భారతదేశ సంగీత ప్రియులకు అందిస్తున్నారు. వెంకటేశ్వర స్వామి పట్ల ఈమెకు ఉన్న భక్తి, అభిమానాన్ని గుర్తిస్తూ 1978లో తొలిసారిగా గాయనిగా గౌరవిస్తూ టీటీడీ స్కాలర్షిప్స్ అందజేశారు. ఇదే టీటీడీ గాయకరాలకు అందజేసిన తొలి స్కాలర్షిప్స్‌గా చెప్పుకోవచ్చు. అక్కడి నుండి మొదలైన ఈమె ప్రస్థానం తిరుమల తిరుపతి దేవస్థానంకే సంగీత విద్వాంసరాలుగా పరిమితమయ్యారు. గత 20 సంవత్సరాలుగా హైదరాబాదులో సొంతంగా మ్యూజిక్ కళాశాలను ఏర్పాటు చేసి శ్రీ వెంకటేశ్వర స్వామి, అన్నమయ్య కీర్తనలను పాడే విధంగా శిక్షణ ఇచ్చి పలువురిని గాయకురాలుగా మారుస్తున్నారు. ఇలా శ్రీ వెంకటేశ్వర స్వామి, అన్నమయ్య కీర్తనలను ఆలపిస్తూ తన సంగీత సామ్రాజ్యాన్ని కొనసాగించారు. టీటీడీ ఈమెను గౌరవిస్తూ పలుమార్లు ఆస్థాన గాయకురాలుగా, విధ్వంసరాలుగా నియమించారు. గత కొన్ని సంవత్సరాలుగా టీటీడీ డాక్టర్ శోభరాజు సేవలను వినియోగించుకోలేకపోయింది. పద్మశ్రీ డాక్టర్ శోభారా జును ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, టీటీడీ విద్యావంతురాలుగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. తనను టీటీడీ విద్యావంతు రాలుగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నందుకు గౌరవిస్తూ ముఖ్యమంత్రి, టీటీడీ పాలకవర్గానికి డాక్టర్ శోభరాజు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇండియన్ బ్యాంకులో ఖాతాదారుల రద్దీ.. రద్దీ..!



**తంబళ్లపల్లె మే 6 ప్రభాతవార్త :**

తంబళ్లపల్లె ఇండియన్ బ్యాంక్ లో నిత్యం ఖాతాదారులతో రద్దీ రద్దీగా ఉండి ఖాతాదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం కేంద్రంలోని ఇండియన్ బ్యాంక్ రోజురోజుకు మహిళా సంఘాలు, రైతులు, వ్యాపారులు, యువకులు వేలాది ఖాతాలతో అభివృద్ధి చెందింది. అయితే ఇండియన్ బ్యాంక్ చాలీ చాలని ప్రదేశంతో ఉదయం 10 గంటల నుండి బ్యాంకు ఖాతాదారులతో కిటకిటలాడుతుంది. ముఖ్యంగా మహిళా సంఘ సభ్యులు, రైతులు బ్యాంకులో ఏసీ, ఫ్యాన్లు సౌకర్యాలు ఉన్నా తీవ్ర రద్దీతో నిలబడలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంక్ అధికారులు ఇప్పటికైనా స్పందించి మహిళలకు, వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఖాతాదారులు కోరుతున్నారు.

## నగిరిపల్లిలో అభినందన సభ

**కలికిరి, మే 6, ప్రభాతవార్త:**



పీలేరు నియోజక వర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో 560 నుంచి 598 మార్కులతో అత్యధిక మార్కులు సాధించిన వంద మంది విద్యార్థినీ విద్యార్థులను పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. నగిరిపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం జరిగింది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి జ్ఞాపికలు బహుకరించి ప్రశంసించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం విద్యాశాఖామంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయడం వల్లే ఈసారి పదో తరగతి ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత సాధ్యమైంది. ప్రభుత్వ బడుల్లో చదివి కూడా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని వీరు నిరూపించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటు, మిగతా అంశాల మాటేమిటి?

### ప్రశ్నించిన తులసి రెడ్డి

**వేంపల్లి:మే 06 ప్రభాతవార్త:**



విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారము రాష్ట్ర విభజన జరిగిన 6 నెలల లోపల ఆంధ్రప్రదేశ్లో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని స్పష్టంగా పేర్కొనడం జరిగింది అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికి ఎప్పుడో ఆంధ్రప్రదేశ్లో విశాఖ కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటు అయి ఉండేది. దురదృష్టవశాత్తు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి రావడంతో గత 11 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్లో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు కాలేదు. ఎట్టకేలకు 11 సంవత్సరాల తర్వాత అయినా విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేయడం హర్షనీయం అన్నారు. అదేవిధంగా విభజన చట్టంలో పేర్కొని అమలు కాకుండా ఉన్న మిగతా అంశాలను కూడా అమలు చేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హోదాను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. . విభజన చట్టంలో సెక్షన్ 46,సబ్ సెక్షన్ 3 ప్రకారము రాయలసీమకు, ఉత్తరాంధ్రకు కేంద్ర ప్రభుత్వం బుందేల్ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని అమలు చేయాలి.కానీ ఇంతవరకు అమలు కాలేదు . దీనిని వెంటనే అమలు చేయాలి. . విభజన చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారము రాష్ట్ర విభజన జరిగిన ఆరు నెలల లోపల కడప జిల్లాలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో సమీకృత ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాలి. ఇంతవరకు నిర్మించలేదు. దీని ని నిర్మించాలి. . విభజన చట్టంలో 13వ షెడ్యూల్లో దుగరాజపట్నం వద్ద మేజర్ ఓడరేవును 2018 కల్లా నిర్మించాలని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. కానీ నిర్మించలేదు. వెంటనే నిర్మించాలి. . రాయలసీమ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కడప రాయచోటి మదనపల్లి బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేసింది.కడప నుంచి పెండ్లిమర్రి వరకు పూర్తయింది.తర్వాత నిలిచిపోయింది. ఈ పనులు వెంటనే పునః ప్రారంభించాలని తులసి రెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం,కదిరి ప్రసాద్ గౌడ్,విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామ కృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, పి.రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,బండారు వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాముని పై కొండా సురేఖ వ్యాఖ్యలు అహంకారపురితం

### భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్

**వేంపల్లి, మే 06 ప్రభాత వార్త**



తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శ్రీరాముని పై చేసిన వ్యాఖ్యలు అహంకారపూరితమైనవని భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రియా తోటలో ఉన్న శ్రీరాముని ఆలయం ఎదురుగా భా.జ.పా నాయకులు కొండా సురేఖ చిత్రపటాలను దగ్ధం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జైశ్రీరామ్ అంటే కోట్లాది మంది హిందువుల విశ్వాసం అని తెలిపారు. అలాంటిది కేవలం జైశ్రీరామ్ అంటే పైనుంచి నిధులు పడతాయా అని మంత్రి వ్యాఖ్యానించడం సబబు కాదని అన్నారు. కోట్లాదిమంది హిందువుల మనోభావాలతో ఆటలాడిన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తోపాటు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కు పట్టిన గతి మీకు కూడా పడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులు లేకుండానే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందా అని ప్రశ్నించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందూ దేవుళ్లను కించపరచడమే కాంగ్రెస్ పార్టీ నాయకుల అసలు నైజమని అన్నారు.శ్రీరాముని అపహాస్యం చేసిన కొండా సురేఖకు దేవాదాయ శాఖ మంత్రి గా కొనసాగే నైతిక అర్హత ఏమాత్రం లేదని అన్నారు.అత్యధిక మెజారిటీ కలిగిన హిందువుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన మీరు ఇతర మతాలను విమర్శించే ధైర్యం చేయగలరా అని ప్రశ్నించారు. ఇకనైనా బుద్ధి తెచ్చుకొని హిందువులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యాదర్శి విశ్వనాథరెడ్డి, మునగల రాము బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, సురేష్, లోకేష్ నాయక్, ఆంజనేయులు నాయక్, రెడ్డి నాయక్ లక్ష్మీదేవి, వీరయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కలికిరిలో కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

### ముఖ్యఅతిథులుగా నల్లారి సోదరులు

**పీలేరు, కలికిరి,మే 6 ప్రభాతవార్త:**



అన్నమయ్య జిల్లా కలికిరి జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో శనివారం కలికిరి ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారికి పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలి కారు. ఇరువురు కలిసి జెండా ఊపి లాంఛనంగా ప్రారం భించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ "యువత లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు దోహదపడతాయి. గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని" పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ "గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు కేపీఎల్ వేదికగా నిలుస్తుందన్నారు.. క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుందని" అన్నారు. అనంతరం నల్లారి సోదరులు ఇరువురు బ్యాట్ పట్టి బంతిని ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఈ టోర్నమెంట్‌లో పలు జట్లు పాల్గొన్నాయి. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కార్య నిర్వాహకులు, కూటమి నాయకులు, క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదవాని ఆరోగ్యానికి భరోసా

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**మదనపల్లె, మే 6 ప్రభాతవార్త :**



సిఎం సహాయనిధి పేదవాని ఆరోగ్యానికి భోరసాలాంటిదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. బుధవారం నియోజకవర్గంలోని రూరల్ మండలంలో 12మంది లబ్ది దారులకు ఎమ్మెల్యే సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల ఆరోగ్యం కోసం పెద్దపీట వేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో సిఎం సహాయనిధి కోసం ధరఖాస్తు చేసుకొన్న ప్రతి లబ్ధిదారునికి వెంటనే చెక్కులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం కొత్తఇండ్లలోని అమ్మవారి జాతరలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆ ప్రాంత వాసులు ఎమ్మెల్యేకు ఘనంగా సత్కరించారు. సిటిఎం క్రాస్ రోడ్డు నందు డ్రైనేజి కాలువ నిర్మాణ పనులను ఎమ్మెల్యే నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డిస్వామి, డైరెక్టర్ చల్లా నరసింహులు, ఎంపిడిఓ తాజ్‌మస్రూన్, డిప్యూటి ఎంపిడిఓ తిరుపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మదనపల్లెలో వర్షం

### వేడికి ఉపశమనం పొందిన ప్రజలు

**మదనపల్లె, మే 6 ప్రభాతవార్త :**



జిల్లా కేంద్రమైన మదనపల్లెలో బుధవారం సాయంత్రం వర్షం పడడంతో ఎండ తీవ్రత నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. వేసవి తాపానికి అల్లాడుతున్న ప్రజలు వర్షం పడడంతో ఒక్కసారిగా చల్లదనం రావడం పట్ల వేడినుండి ఊపిరిపీల్చుకొన్నారు. సుమారు అరగంట పాటు వర్షం పడడం వల్ల పట్టణంలో రోడ్లు, కాలువలు జలమయమైనాయి. రుతుపవనాలు ప్రారంభం కాకముందే వర్షాలు పడడం పట్ల పలువురు ఆనందిస్తున్నారు. గత రెండు నెలలుగా వేసవి తాపానికి వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోజూ సాయంత్రం వర్షపు గాలులు వీస్తుండడం వల్ల చల్లదనంగా ఉంటుంది. చిన్నపాటి వర్షానికే మదనపల్లె వాతావరణం చల్లబడిపోతోంది. ఆంధ్రాఊటీగా పేరుపొందిన మదనపల్లె సౌండ్ పోల్యూషన్, ట్రాఫిక్, వాతావరణ మార్పులతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు సకాలంలో పడితే ఈ ప్రాంతం వాతావరణంలో రాష్ట్రంలోనే చల్లదనంగా ఉంటుంది.

## మదనపల్లెలో ఘనంగా గంగజాతరలు

**మదనపల్లె, మే 6 ప్రభాతవార్త :**



మదనపల్లె పరిసర ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో గంగజాతరలు ఘనంగా జరిగాయి. బొమ్మనచెర్వు, కొత్తఇండ్లు, శ్రీవారినగర్, అంకిశెట్టిపల్లి గ్రామాల్లో గంగమ్మ జాతరలు వైభవంగా నిర్వహించారు. బొమ్మనచెరువులో జరిగిన గంగజాతరకు రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు హాజరై అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. సీనియర్ టిడిపి నాయకులు బాబురెడ్డి, చినబాబులను ఆ ప్రాంత ప్రజలు ఘనంగా శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనెల అంతా జాతర్లను ప్రజలు ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముద్దుక్రిష్ణమనాయుడు, మహబూబ్‌ఖాన్, శ్యామ్, చంటిరాయల్, సునీల్‌రెడ్డి, బిజెపినాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సత్య సాయి బాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ జయంతి ఉత్సవాలు

**పీలేరు మే 6 ప్రభాతవార్త:**



పుట్టపర్తి సత్య సా ం ఇ బా బా మాతృమూర్తి ఈశ్వరమ్మ జయంతి ని పురస్కరించుకొని భగవాన్ శ్రీ సత్య సాయి పీలేరు భజన మండలి కన్వీనర్ ఎస్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను పీలేరు పట్టణం ఎల్ బి ఎస్ రోడ్డు శ్రీ సత్యసాయి గ్లాస్ అండ్ ప్లైవుడ్ షాప్ దగ్గర నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భగవాన్ శ్రీ సత్యసాయి పీలేరు భజన మండలి సభ్యులు సభ్యులు ప్రముఖ వైద్యులు డాక్టర్ ఈశ్వర్ సురేంద్ర, డాక్టర్ నాగవేణి లు హాజరై సత్య సాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి సాయిబాబా భక్తి భజన పాటలు ఆలపించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత వేగంగా దూసుకుపోతున్న టెక్నాలజీ యుగంలో మానవ మనుగడ కోసం టెలికాం పొల్యూషన్, వాతావరణ పొల్యూషన్, వృత్తిరీత్యా అనేక రకాల మానసిక ఒత్తిడిలో మానవ జీవితం ఎన్నో అనారోగ్యాలకు గురై మానవులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఎప్పుడు వృత్తిరీత్యా పనులే కాకుండా అప్పుడప్పుడు మానసిక ప్రశాంతత కొరకు దైవచింతన, యోగ అవసరమని సమయ సందర్భాన్ని బట్టి వీలు చూసుకుని ప్రతి ఒక్కరు దైవచింతలతో పాటు సమాజ సేవలో పాలు పంచుకోని ఆరోగ్యకర వాతావరణంలో మెలగాలని ఇతవు పలికారు. పీలేరు పట్టణం మల్లెల వారి వీధిలోని శ్రీ సాయి బాలాజీ ఈ ఎన్ టి హాస్పిటల్ దగ్గర ప్రతి ఆదివారం సాయంత్రం సాయిబాబా భజన కార్యక్రమం నిర్వహించబడున ని ఆసక్తిగల భక్తాదులు ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా తెలియజేశారు అనంతరం పుట్టపర్తి శ్రీ సత్తి బాలయ్య బాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ ను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మోనం పాటించి అనంతరం పీలేరు పట్టణంలో వేసివి తాపానికి ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కె బాలసుబ్రమణ్యం, పామిడి నరసింహులు, మధు, సాయి సర్వీస్, ఉమా మహేష్,ఉదయశ్రీ, ఆనందాచారి, రెడ్డి శేఖర, సుమంత్, సయ్యద్ బాషా, సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.